


# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

11.09.2026
శుక్రవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 121
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## ఇకపై వందేమాతరంలో రెండు చరణాలే పాడండి

### ప్రభుత్వం ఆదేశాలు.. కర్ణాటక ప్రభుత్వం కీలక ఉత్తర్వులు!

బెంగళూరు, సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్



'వందేమాతరం' జాతీయ గీతం విషయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక వేడుకల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గీతాన్ని పాడే సమయంలో ఏకరూపత, గౌరవం, సరైన ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం పేర్కొంది. 2లో..

## చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా

- మాజీ మంత్రి హరీశ్ రావు: సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం
- నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ లేదా?

హైదరాబాద్, సెప్టెంబర్ 10, అనంతజనశక్తి న్యూస్

రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు. 2లో..





## ఇకపై పైలట్లందరికీ డ్రగ్ టెస్టులు

- డీజీసీఏ సంచలన నిర్ణయం
- ఎయిర్ ఇండియా ఘటన తర్వాత కీలక నిర్ణయం!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10, అనంతజనశక్తి న్యూస్

విమాన ప్రయాణాల భద్రత విషయంలో భారత విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని అన్ని విమానయాన సంస్థల్లో పనిచేస్తున్న పైలట్లకు ఒక్కసారి డ్రగ్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించినట్లు ఓ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. వచ్చే ఏడాది జూలై నాటికి ఈ పరీక్షలను పూర్తి చేయాలని ఎయిర్‌లైన్స్‌కు సూచించినట్లు తెలిపారు. 6లో..



# పేదల సొంతింటి కల నెరవేర్చాలి

- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం
- రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు
- లేదా స్థలం పట్టా అందేలా చర్యలు తీసుకోవాలి
- ఈ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి చేయాలి
- 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులు
- మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలనలో
- అక్టోబర్ 15 నాటికి వాటన్నింటినీ పూర్తిచేస్తాం
- 1,692 గ్రామాల్లో సుమారు 18 వేల మందికి ఇంటి పట్టాలు

2లో..



**అమరావతి, సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**
**రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి స్థలం పట్టా అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై అమరావతిలో గురువారం జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. ఈ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.**

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, అక్టోబర్ 15 నాటికి వాటన్నింటినీ పూర్తిచేస్తామన్నారు. 1,692 గ్రామాల్లో సుమారు 18 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించామని వివరించారు. కొత్తగా ఎంతమందికి ఇళ్ల పట్టాలివ్వాలి? ఎంతమంది ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాల్సి ఉందనే అంశంపై పక్కాగా లిస్ట్ ప్రిపేర్ చేయాలని సీఎం ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టాలు పంపిణీ చేయాలని సూచించారు.

ఏపీలో గృహ నిర్మాణ పురోగతి వివరాలపై చంద్రబాబు ఆరా తీయగా.. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తైనట్టు అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు ఆయా దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నిర్మాణంలో ఉన్న అన్ని గృహాలనూ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణం, ఇంటి పట్టాల పంపిణీ విషయంలో కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేసిన ఆయన.. 10 రోజుల్లో సమగ్ర యాక్షన్ ప్లాన్‌తో రావాలని ఆదేశించారు.

ఇంటి నిర్మాణం, పట్టాల అంశాలకు జిల్లా కలెక్టర్లు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తిచేసేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు కూడా చొరవ తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇందుకోసం టైమ్‌బౌండ్ ప్రోగ్రాం రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలం అందించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటని పేర్కొంటూ.. ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

సదస్సులో డిజిటల్ కనెక్టివిటీ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో ప్రతి మూలకూ నెట్‌వర్క్ కనెక్టివిటీ చేరాల్సిందేనని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ పరిస్థితులను వివరించిన అనంతరం, సీఎం చంద్రబాబు అధికారులు, కలెక్టర్లకు స్పష్టమైన గడువు విధిస్తూ సున్నితంగా హెచ్చరించారు.

## మాజీ మంత్రి బొత్స కన్నీటిపర్యంతం

- కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం
- విజయనగరం జిల్లా గరివిడిలో భేటీ
- చిన్న శ్రీను) వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో

6లో..



## ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.కోటి బీమా

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ప్రమాదవశాత్తు లేదా దురదృష్టవశాత్తూ మరణిస్తే
- ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా అండ

2లో..

హైదరాబాద్, సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మరియు పెన్షనర్లకు ప్రభుత్వం అందిస్తున్న రూ.కోటి ఉచిత బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటన చేశారు. ఒక ఉద్యోగి ప్రమాదవశాత్తు లేదా దురదృష్టవశాత్తూ మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా కొండంత అండగా నిలవాలనే మానవీయ ఉద్దేశంతోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వంపై గానీ, ఉద్యోగులపై గానీ ఎలాంటి రూపాయి భారం పడకుండా బ్యాంకర్ల భాగస్వామ్యంతో ఈ ప్రమాద బీమాను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ లైఫ్‌లైన్

### మహిళలకు రూ.12,171 కోట్లు ఆదా!: పొన్నం



హైదరాబాద్, సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్

దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలకు రైల్వేలు లైఫ్‌లైన్ అయితే, తెలంగాణ ప్రజలకు ఆర్టీసీయే ప్రధాన జీవనాడి అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ 65 లక్షల మంది ప్రయాణికులను ఆర్టీసీ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తోందని పేర్కొన్నారు. 2లో..

## నాందేడ్‌లో రోడ్డు ప్రమాదం

- ట్రక్కు-టాటా మ్యాజిక్ ఢీ
- 9 మంది దుర్మరణం
- మరో ముగ్గురి పరిస్థితి విషమం

2లో..



## త్వరలోనే డీఎస్సీ స్కాం పార్ట్2

- కేస్ స్టడీలతో సహా మరిన్ని అక్రమాలు
- వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు
- వెరిఫికేషన్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయి
- టీచర్ పోస్టుల కోసం డబ్బులు తీసుకున్నారు
- వీడియోలపైనా సమగ్ర విచారణ జరపాలి

2లో..



అమరావతి, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ 2025 నియామక ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. డీఎస్సీ వ్యవహారంలో తాను ఇప్పటికే డీఎస్సీ స్కాం పార్ట్ 1 పేరుతో పలు అంశాలను ప్రజల ముందుకు తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూనే.. త్వరలోనే డీఎస్సీ స్కాం పార్ట్2లో మరిన్ని అక్రమాలను బయటపెడతానని వెల్లడించారు.

## నాగబాబుకు కేబినెట్ హోదా

- జీతభత్యాలు, అలవెన్సులపై ఉత్తర్వులు
- జీవో నంబర్ 7 ప్రకారం జీతం
- నెలకు రూ.4.50 లక్షల వరకు జీతం, అలవెన్సులు

2లో..



హైదరాబాద్, సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు)కు ప్రభుత్వం కేబినెట్ హోదాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాగబాబు జీత భత్యాలు, సిబ్బంది నియామకం, ఇతర ప్రయోజనాలను ఖరారు చేసింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పర్యావరణ, అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది.. అలాగే ఆర్థికశాఖ సహా సంబంధిత శాఖలకు సమాచారం అందించారు. నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆయన జీత భత్యాలు, సిబ్బంది నియామకం, ఇతర ప్రయోజనాలకు సంబంధించి ప్రభుత్వం 2025 జనవరి 10న జారీ చేసిన జీవో నంబర్ 7ను ప్రస్తావించింది.

## ఆప్ నా ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్

- రాఘవ్ చద్దా ఫైర్..
- ఢిల్లీ ఓటర్ లిస్ట్ వివాదంపై రాఘవ్ చద్దా
- "నేను మూవ్ ఆన్ అయ్యా..
- ఆప్ఇంకా నా పేరు పిలుస్తోంది

2లో..



# నాగబాబుకు కేబినెట్ హోదా



(మొదటి పేజీ తరువాయి)

2025లో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 7లో కేబినెట్ హోదా ఉన్నవారికి చెల్లించే జీత భత్యాలు, ఇతర సౌకర్యాలు గురించి క్లియర్‌గా ఉంది. ఈ జీవో ప్రకారమే నాగబాబుకు కూడా జీతాలు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేబినెట్ హోదా పొందిన వారికి జీతం, అలవెన్సుల వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రంలో కేబినెట్ హోదా పొందిన వారికి ప్రభుత్వం నెలకు రూ.2 లక్షల జీతం ఇస్తోంది. కేబినెట్ హోదా పొందినవారి ఆఫీస్‌కు సంబంధించిన ఫర్నీచర్ ఏర్పాటుకు వన్‌టైం గ్రాంట్.. వ్యక్తిగత సహాయ సిబ్బంది అలవెన్స్‌లు, ఇతర సౌకర్యాల కల్పనకు మరో రూ.2.50 లక్షలు చెల్లిస్తారు. జీతంతో పాటుగా అలవెన్స్‌లు కలిపి మొత్తం రూ.4.50 లక్షలు చెల్లిస్తారని జీవోలో ఉంది. కాబట్టి నాగబాబుకు కూడా నెలకు రూ.4.50 లక్షల వరకు జీతం, అలవెన్సులు చెల్లిస్తారనే చర్చ జరుగుతోంది.

ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పలువుర్ని కేబినెట్ హోదాలో నియమించింది. మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ కేబినెట్ హోదాలో ఉన్నారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు చాగంటి కోటేశ్వరరావు, మంతెన సత్యనారాయణ రాజు, మాజీ కార్టూనిస్ట్ పోచంపల్లి శ్రీధర్ రావులకు కూడా కేబినెట్ హోదా ఉంది. వీరందరికి జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే జీవోను జారీ చేసింది. తాజాగా నాగబాబుకు కూడా కేబినెట్ హోదాలో ఇవే జీతభత్యాలు, అలవెన్సులు అందిస్తారు.

# ఆప్ నా ఎక్స్- గర్ల్‌ఫ్రెండ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10, అనంతజనశక్తి న్యూస్**

రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీ ఓటర్ లిస్టులో తన పేరు ఎలా చేరిందనే ప్రశ్నలపై చద్దా స్పందిస్తూ.. ఆప్ ఇంకా నన్ను మరిచిపోలేకపోతోందని, తన పేరు పదేపదే ప్రస్తావిస్తూ.. ''ఎక్స్‌గర్ల్ ఫ్రెండ్''లా వ్యవహరిస్తోందని సెటైర్లు వేశారు. ''నేను మూవ్ అన్ అయ్యాను, కానీ ఆప్ మాత్రం నా గురించే కలలు కంటోంది, నా పేరు జపిస్తోంది. ఆప్ ఎక్స్‌గర్ల్‌ఫ్రెండ్‌లా వ్యవహరిస్తోంది. బాయ్ ఫ్రెండ్ మాత్రం మూవ్ ఆన్ అయ్యాడు'' అని అన్నారు.

ఢిల్లీ ఓటర్ జాబితాలో రాఘవ్ చద్దా పేరు చేర్చడంపై ఆప్ ఎన్నికల సంఘం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేసింది. కొత్త ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్ 6 ఎప్పుడు ఎక్కడ దాఖలైందో వెల్లడించాలని ఆప్ డిమాండ్ చేసింది. ఆప్ జాతీయ మీడియా ఇన్‌చార్జ్ అనురాగ్ ధండా మాట్లాడుతూ.. రాజేందర్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు వచ్చిన ఫారమ్ 6 దరఖాస్తుల్లో చద్దా పేరు లేదని పేర్కొన్నారు. ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా జాబితాలో రాజేందర్ నగర్ నియోజకవర్గంలో 746వ సీరియల్ నంబర్ వరకు మాత్రమే ఎంట్రీలు ఉన్నాయని, అయితే చద్దా పేరు 747వ స్థానంలో ఎలా వచ్చిందని ఆప్ ప్రశ్నించింది. తుది ఓటర్ జాబితా నవంబర్ 4న ప్రచురించాల్సి ఉంది. ఆప్ నుంచి బీజేపీలోకి రాఘవ్ చద్దా చేరిన కొన్ని నెలల తర్వాత ఈ వివాదం రెండు పార్టీల మధ్య వేడికి కారణమైంది. రాఘవ్ చద్దా ఓటర్ లిస్టులో పేరు అంశంపై రెండు పార్టీలు విమర్శలు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉంటే, చద్దా పంజాబ్‌లోని ఆప్ సర్కార్‌ను టార్గెట్ చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ పరిస్థితి దారుణంగా ఉందని, డ్రగ్స్ కోసం క్యూలు కడుతున్నారని విమర్శించారు. సంగ్రూర్‌కు చెందిన గుల్జార్ సింగ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఘటనపై చద్దా మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల తన కుమారుడు ఇబ్బంది పడుతున్నాడని ప్రశ్నించిన గుల్జార్ సింగ్ ఏం తప్పు చేశారని ప్రశ్నించారు. ఒక సమస్యపై ప్రశ్నించడం నేరమా? అని చద్దా ఫైర్ అయ్యారు. గుల్జార్ సింగ్ ఆత్మహత్యకు ముందు అవమానానికి గురయ్యారని, ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన బీజేపీ నేతల్ని ఆప్ కార్యకర్తలు, అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. గత 15 ఏళ్లలో పంజాబ్‌లో డ్రగ్స్ సమస్య పెరిగిందని, ఈ సమస్యపై ఆప్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.కోటి బీమా

(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,91,056 మంది లబ్ధి పొందుతున్నారని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా, 5,00,158 మంది తాత్కాలిక, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, మల్టీపర్పస్ వర్కర్లు, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ సిబ్బంది ఉన్నారన్నారు. వీరితో పాటు 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు కూడా ఈ బీమా ధీమా వర్తిస్తోందని వివరించారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటికే 98 క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించి బాధితుల కుటుంబాలకు కోట్ల రూపాయల చెల్లింపులు పూర్తి చేసినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. బీమాతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక హెల్త్‌కార్డులను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని శాసనసభ వేదికగా తెలిపారు.

# నాందేడ్‌లో రోడ్డు ప్రమాదం

**నాందేడ్, సెప్టెంబర్ 10,**
**అనంతజనశక్తి న్యూస్**



**మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న ట్రక్కు.. టాటా మ్యాజిక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో 9 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఛిద్రమైన శరీరాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. నివేదికల ప్రకారం.. నాందేడ్-భోకర్ హైవేపై వాకడ్ గ్రామం సమీపంలోని సీతాఖండి ప్రాంతంలో సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. భోకర్ నుంచి నాందేడ్ వైపు అతివేగంతో ప్రయాణిస్తున్న ట్రక్కు.. ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వ్యాన్‌ను ఢీకొంది. ఢీకొన్న ధాటికి టాటా మ్యాజిక్ వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జు అయి రోడ్డు పక్కకు పడిపోయింది. వ్యాన్‌లో 12 మంది ప్రయాణికులు ఉన్నారు. 9 మంది ఘటనాస్థలిలోనే చనిపోయారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో రెండు వాహనాలు అతివేగంతో ప్రయాణిస్తున్నాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.**

**పెద్ద శబ్దం విన్న గ్రామస్తులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయపడిన మరో ముగ్గురిని భోకర్, నాందేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. వ్యాన్‌ను ఢీకొన్న తర్వాత ట్రక్కు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకుపోయాడు. అతడిని బయటకు తీయడానికి పోలీసులు, సహాయక బృందాలు తీవ్రంగా శ్రమించాయి. వ్యాన్‌లోని ప్రయాణీకులందరూ స్థానికులేనని భావిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నారు.**

# త్వరలోనే డీఎస్సీ స్కాం పార్ట్2

(మొదటి పేజీ తరువాయి)

ఈసారి కేస్ స్టడీలతో సహా అన్నింటినీ వెల్లడిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు వ్యక్తులు అక్రమాలకు పాల్పడి నిరుద్యోగులు, పరీక్షను నిజాయితీగా రాసిన అభ్యర్థులకు అన్యాయం చేశారని వైఎస్ జగన్ ఆరోపించారు.

డీఎస్సీ 2025ను ప్రభుత్వం మెగా డీఎస్సీగా ప్రచారం చేసినప్పటికీ.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై లోతుగా పరిశీలిస్తే తవ్వేకొద్దీ మరిన్ని అంశాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ అక్రమాలపై ఆధారాలు, ప్రశ్నలు లేవనెత్తుతున్న వారిపై కేసులు, బెదిరింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై వార్తలు రాస్తున్న జర్నలిస్టులపైనా కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిణామాలు ఆందోళన కలిగించేవని ఆయన వ్యాఖ్యానించారు.

డీఎస్సీ అంశంపై తాను గతంలో లేవనెత్తిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఇప్పటివరకు సరైన సమాధానాలు ఇవ్వలేదని వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. డీఎస్సీ అంటేనే చంద్రబాబుకు బీపీ పెరుగుతుంది అంటూ ఆయన సెటైర్లు వేశారు. డీఎస్సీ ప్రశ్నపత్రాల తయారీ, పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలను ఒకే వ్యక్తి చేతిలో ఎందుకు పెట్టారో చంద్రబాబు ప్రభుత్వం సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ విధానమే అక్రమాలకు అవకాశం కల్పించిందని ఆయన ఆరోపించారు.



డీఎస్సీ ప్రశ్నపత్రాల తయారీలో కీలకమైన ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన నవీన్‌కు పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చిందని జగన్ ప్రశ్నించారు. ఫస్ట్ ర్యాంక్ వచ్చినప్పటికీ ఆయనకు ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. మెరిట్ జాబితాలో పేరు ఉన్నప్పటికీ దాన్ని ఎందుకు మార్చారని.. నవీన్‌కు సంబంధించిన ఐడీని ఎందుకు బ్లాక్ చేశారని ప్రశ్నించారు. అలాగే ఫస్ట్ ర్యాంక్ సాధించిన అభ్యర్థిని వెరిఫికేషన్‌కు ఎందుకు పిలవలేదని అన్నారు. తనను వెరిఫికేషన్‌కు పిలవలేదంటూ నవీన్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని జగన్ పేర్కొన్నారు. ఈ పరిణామాల కారణంగానే నవీన్ కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నవీన్ వ్యవహారంలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఇవన్నీ డీఎస్సీ అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నంలో భాగమా అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల తయారీ నుంచి మెరిట్ జాబితా, వెరిఫికేషన్ వరకు మొత్తం ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. డీఎస్సీ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను కూడా డబ్బులకు విక్రయించారనే ప్రచారం సోషల్ మీడియాలో జరుగుతోందని ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ 2025లో స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన నిబంధనలపైనా జగన్ ప్రశ్నలు సంధించారు. పరీక్ష రాయకుండానే 372 మందికి ఉద్యోగాలు ఇచ్చేలా నిబంధనలు మార్చారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో జీవో నంబర్ 4, 47 తీసుకువచ్చి.. అనంతరం జీవో నంబర్ 23, 25, 56 ద్వారా నిబంధనలను మార్చారని జగన్ పేర్కొన్నారు. నచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చుకునే విధంగా ఈ మార్పులు చేశారని ఆరోపించారు.

# ఇకపై వందేమాతరంలో రెండు చరణాలే పాడండి

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన కన్నడ ఉత్తర్వుల అనువాదం ప్రకారం.. కేంద్ర హోంశాఖ 'వందేమాతరం' అధికారిక వెర్షన్, ప్రభుత్వ, ప్రజా కార్యక్రమాల్లో దాని గానం లేదా ప్రదర్శనకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపింది. అయితే రాష్ట్రంలో జరిగే కార్యక్రమాల స్వభావం, సందర్భానికి అనుగుణంగా గీతాన్ని పాడే విషయంలో ఏకరూపత, గౌరవం, సరైన ప్రోటోకాల్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

**తొలి రెండు చరణాలకే పరిమితం**

కర్ణాటక ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక వేడుకల్లో 'వందేమాతరం'లోని తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జాతీయవాదం, ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడంలో ఈ గీతం కీలక పాత్ర పోషించిందని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ నిర్ణయం రాజకీయంగా మరోసారి చర్చకు దారితీసే అవకాశం ఉంది. కేంద్ర హోంశాఖ అధికారిక కార్యక్రమాల్లో పూర్తి 'వందేమాతరం' పాడాలని ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా కర్ణాటక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

**కేంద్రం నిర్ణయానికి భిన్నంగా కాంగ్రెస్ వైఖరి**

డీకే శివకుమార్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. 'వందేమాతరం'పై కాంగ్రెస్ పార్టీ గతంలో తీసుకున్న వైఖరికి అనుగుణంగా ఉందని భావిస్తున్నారు. గత నెలలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నేతల సమక్షంలో తీసుకున్నదని కాంగ్రెస్ చెబుతోంది.



**పూర్తి వందేమాతరం తప్పనిసరి చేసిన కేంద్రం**

ఇదిలా ఉంటే ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమావేశాల్లో పూర్తి 'వందేమాతరం' పాడటాన్ని తప్పనిసరి చేసింది. జాతీయ గీతం ఆలపించడాన్ని అడ్డుకోవడం లేదా అంతరాయం కలిగించడం నేరంగా పరిగణించేలా పార్లమెంట్‌లో బిల్లును కూడా ప్రవేశపెట్టింది. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. 1937లో కాంగ్రెస్ అగ్రనేతలు తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగానే తాము వ్యవహరిస్తున్నామని పేర్కొంది.

**'అసంపూర్తి వందేమాతరం'పై ఖర్గేకు విమర్శలు**

ఆగస్టులో గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'వందేమాతరం' పూర్తి వెర్షన్‌ను పాడలేదంటూ విమర్శలు వచ్చాయి. దీనిపై బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. దీనికి ఖర్గే స్పందిస్తూ.. మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి తదితరులు పాడిన వెర్షన్‌నే తాను పాడానని చెప్పారు. అదే వెర్షన్‌ను పాడటం నేరమైతే, ఆ నేతలపై కూడా కేసులు నమోదు చేయాలని ఆయన వ్యాఖ్యానించారు.

**'వందేమాతరం' చరిత్ర ఇదీ..**

'వందేమాతరం'ను ప్రముఖ రచయిత బంకించంద్ర ఛటర్జీ తన 'ఆనందమఠం' నవలలో రచించారు. 1896లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి వందేమాతరాన్ని ఆలపించారు. అయితే ఆ తర్వాత ముస్లిం లీగ్ నాయకులు ఈ గీతంలోని హిందూ దేవతల ప్రస్తావనలను అభ్యంతరకరంగా పేర్కొంటూ వ్యతిరేకించారు. దీంతో 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై.. వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని నిర్ణయించింది. ప్రస్తుతం కేంద్రం, కాంగ్రెస్ వైఖరులు భిన్నంగా ఉండటంతో కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి రాజకీయ చర్చకు తెరతీసే అవకాశం ఉంది.

# తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ లైఫ్‌లైన్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీపై శాసనసభలో పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సుదీర్ఘంగా, వివరంగా సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా, రిటైర్డ్ ఈడీని ఎండీగా నియమించి సంస్థను నిర్వీర్యం చేసి నష్టాల బాటలోకి నెట్టిందని, అలాగే కార్మికుల సమస్యలను కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఇది మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ఆర్టీసీకి కొత్త జీవం పోసిందని, ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగి బస్ స్టేషన్లలో రద్దీ పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు 347.47 కోట్ల సార్లు ఉచితంగా ప్రయాణించి, రూ.12,171 కోట్లు ఆదా చేసుకున్నారని వివరించారు. ఆసుపత్రులు, దేవాలయాలు, బంధువుల ఇళ్లకు, పిల్లల చదువుల కోసం ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. గత సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల వినతులకు అనుగుణంగా కొత్త సర్వీసులు, అదనపు ట్రిప్పులు ప్రారంభించామని, కరోనా సమయంలో రద్దయిన సర్వీసులను కూడా పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ లక్షలాది మందిని సురక్షితంగా చేర్చుతున్న డ్రైవర్లు, కండక్టర్ల సేవలను సభ అభినందించాలని కోరారు.



గతంలో ఆపరేషనల్ నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఇప్పుడు లాభాల దిశగా పయనిస్తోందని, సంస్థను బలోపేతం చేసేందుకు పాత బస్సుల స్థానంలో ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని తెలిపారు. 15 సంవత్సరాలు దాటిన బస్సులను తొలగిస్తున్నామని, ఇప్పటికే 340 డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చామని చెప్పారు. హైదరాబాద్‌లో PM EDrive కింద 2,200 ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తున్నామని, ఈ బస్సుల్లో సీసీ కెమెరాలను అమర్చినట్లు వెల్లడించారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రీమియం, ఎలక్ట్రిక్ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఆదిలాబాద్‌లో ఎస్పీ సహకారంతో బస్సుల్లో సీసీ కెమెరాలు అమర్చామని, భవిష్యత్‌లో అన్ని బస్సులకూ ఇవి విస్తరిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లను అనుసంధానిస్తూ 370 కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్నామని, అన్ని గ్రామాలకు ఆర్టీసీని చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

డిపోల సంఖ్యను 97 నుంచి 99కి పెంచి, కొత్తగా పెద్దపల్లి, ములుగులలో డిపోలు ఏర్పాటు చేశామని, అవసరమైన చోట కొత్తవి తెరుస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు సీఎస్ఆర్ నిధులతో బస్ స్టేషన్లలో మౌలిక వసతులు పెంచుతున్నామని, యాదాద్రి వెళ్లే వారి కోసం వంగర వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల నిలుపుదలకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ప్రసక్తే లేదని, గాజులరామారం, శంషాబాద్, ఫ్యూచర్ సిటీల్లో టెర్మినల్స్ కోసం స్థలాలు సేకరించామని తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం స్థలాలు తీసుకుంటే, ఆర్టీసీకి కూడా ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తున్నామని చెప్పారు. గతంలో 60 రోజుల సమ్మెను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కానీ తమ ప్రభుత్వం కార్మిక సమస్యలను పరిష్కరిస్తోందని అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ కుటుంబానికి ఉద్యోగం, ఇల్లు అందిస్తున్నామని, తొలగించబడిన 244 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకుని, 1,430 మందికి కారుణ్య నియామకాలు కల్పించామని పేర్కొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతానికి కనెక్టివిటీ కల్పించడానికి ఎంత సమయం తీసుకుంటారో వెంటనే చెప్పాలని ఐటీ కార్యదర్శిని సీఎం నిలదీశారు. టవర్ల ఏర్పాటుకు భూకేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశిస్తూ, కేవలం 7 రోజుల్లో కనెక్టివిటీకి అవసరమైన భూమిని అప్పగించాలని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ టవర్ నిర్మాణం కోసం ఉచితంగా ల్యాండ్ ఇవ్వడంతో పాటు, నెట్‌వర్క్ ఆపరేటర్లకు విద్యుత్‌ను కూడా ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని అధికారులు సీఎంకు వివరించారు.

ఒక్క టవర్‌కు ఐదు సెంట్లే... బాధ్యత అందరిదీ

ఒక టవర్ నిర్మించడానికి కేవలం 5 నుంచి 5.5 సెంట్ల భూమి మాత్రమే అవసరమవుతుందని, అలాంటప్పుడు భూసేకరణలో ఆలస్యం ఎందుకని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. ఒకసారి సంక్షేమ, అభివృద్ధి ప్రోగ్రామ్‌ను చేతిలోకి తీసుకున్నాక దానికి కేవలం ఐటీ కార్యదర్శి మాత్రమే బాధ్యుడు కాదని, జిల్లాల్లో ఉన్న కలెక్టర్లు కూడా పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుందని వివరించినప్పటికీ, సీఎం చంద్రబాబు మాత్రం కచ్చితమైన గడువులోనే పనులు పూర్తికావాలని ఆదేశించారు.

హిస్టరీ రిపీట్ చేస్తామంటే ఊరుకోను

"పాత పద్ధతుల్లోనే పనిచేస్తాం, కథ మళ్లీ మొదటికి వస్తుంది అంటే నేను ఊరుకోను... నాకు కావాల్సింది కేవలం ఫలితాలు మాత్రమే" అని సీఎం అధికారులకు తేల్చి చెప్పారు. రాష్ట్రంలో డిజిటల్ నెట్‌వర్క్ కల్పించాలనే ఆలోచన తనకంటే ముందుగా కలెక్టర్లకే ఉండాలని వ్యాఖ్యానించారు. రాబోయే తదుపరి కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 100 శాతం నెట్‌వర్క్ కనెక్టివిటీ అందుబాటులోకి రావాల్సిందేనని, ఈ లక్ష్యాన్ని సాధించడంలో అధికారులు యంత్రాంగాన్ని పరుగులు తీర్పించాలని ఆదేశించారు.



# చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)

**కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రఃముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు.**

**బీఆర్ఎస్ ఉన్నప్పుడు 2014-15 నుండి 2023-24 వరకు ప్రతి సంవత్సరం వచ్చిన కృష్ణ నది నీళ్లలో 45 శాతం నుండి 30 శాతం ఎత్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో 28.49 శాతం నీళ్లు ఎత్తారు, 2025-26లో 25 శాతం మాత్రమే ఎత్తారని హరీశ్ రావు తెలిపారు. దీన్ని బట్టి ఎవరు తెలంగాణ ప్రయోజనాలు కాపాడారో అర్థం కావడం లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణ జలాల్లో అతి తక్కువ సాగు నీరు వాడుకున్నది ఈ మూడు సంవత్సరాలలో నేనన్నారు.**

# విమర్శలకు మేం విముఖం కాదు

- తగిన వేదిక ద్వారా సహేతుకంగా అవి ఉండాలి
- పాఠ్యపుస్తక వివాదాంశంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య



విమర్శలకు న్యాయవ్యవస్థ వ్యతిరేకం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కాకపోతే ఆ విమర్శలు సరైన వేదిక ద్వారా, సముచితంగా, హేతుబద్ధమైన యంత్రాంగంలో రావాలని పేర్కొంది. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చడంపై తమంత తాముగా చేపట్టిన విచారణను ముగిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. ''బాధ్యతాయుతమైన చర్చకు, అవగాహనరాహిత్య అంచనాకు నడుమ చాలా వ్యత్యాసం ఉంటుంది. న్యాయవ్యవస్థ ఎప్పుడూ విమర్శకు విముఖంగా ఉండదు, ఉండజాలదు. సచేతనమైన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి నిర్మాణాత్మక విమర్శలు అవసరం. న్యాయవ్యవస్థ పనితీరుపై అలాంటి విమర్శ.. సంస్థాగత జవాబుదారీతనానికి, స్వీయ దిద్దుబాటుకు తోడ్పడుతుంది. తగిన పరిశీలన లేకుండా పాఠ్య ప్రణాళికలో ఇలాంటి విమర్శల్ని చేరిస్తే అది విద్యార్థుల మెదళ్లపై ముద్ర వేస్తుంది'' అంటూ ఈ నెల ఒకటో తేదీన తీర్పు వెలువరించింది. కేంద్రం నియమించిన నిపుణుల కమిటీ చేసిన సూచనల మేరకు వివాదాస్పద అధ్యాయాన్ని తొలగించిన విషయాన్ని కోర్టు గమనంలో తీసుకుంది.

**త్రిభాషా సూత్రం నుంచి ఆరో తరగతికి మినహాయింపును పరిశీలించండి**

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరో తరగతికి త్రిభాషా సూత్రం నుంచి మినహాయింపు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని సీజేఐ ధర్మాసనం బుధవారం సీబీఎస్ఈకి సూచించింది. దీనిని పరిశీలించేందుకు సమయం ఇవ్వాలన్న సొలిసిటర్ జనరల్ అభ్యర్థన మేరకు తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదావేసింది.

**సీటుబెల్టు వినియోగించేలా చేయాల్సింది అమలు సంస్థలే**

వాహనం గమనంలో ఉన్నప్పుడు సీటుబెల్టు బిగించుకోవడం తప్పనిసరి అని చెప్పేందుకు తగినన్ని చట్టాలు ఇప్పటికే ఉన్నాయని, దానిని చూడాల్సింది 'అమలు సంస్థలు' (ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు) మాత్రమేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సీటుబెల్టుల వాడకాన్ని తప్పనిసరి చేసే ఆదేశాలు ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. రహదారి ప్రమాదాల్లో మరణాలను, గాయపడుతున్న సందర్భాలను నివారించాలంటే ఇలాంటి ఆదేశాలు అవసరమని పిటిషనర్ కోరారు. చట్టమైతే ఉన్నా, ఫ్యాన్సీ సీటు కవర్ల కోసమో, మరో అవసరం కోసమో వాహనాల్లో మార్పులు చేస్తున్నందువల్ల వాటిలో సీటుబెల్టులు పనిచేయడం లేదని తెలిపారు. ''సీటుబెల్టులపై చట్టం విస్పష్టంగా ఉంది. అమలు ఒక్కటే ప్రశ్నార్థకం. ప్రతి పౌరుడు, ప్రతి డ్రైవరు దానికి పాటించేలా మేం ఎలా హామీ ఇవ్వగలం? ఈ అంశంపై మీ సూచనల్ని సంబంధిత వర్గాలకే పంపించండి. ఈ పిటిషన్ ప్రతినే దానికి ఉపయోగించుకోవచ్చు'' అని సీజేఐ తెలిపి, పిటిషన్‌ను ముగించారు.

**ఎంత ధైర్యం..! మేం వద్దన్నాకా నోటీసులా?**

కాక్రోచ్ జనతాపార్టీ నిరసనల్లో పాల్గొన్న ఒక విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఇవ్వడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ''ఆ నోటీసులు ఎలా ఇస్తారు? దేశవ్యాప్తంగా ఏ విద్యార్థిపైనా బలవంతపు చర్యలు వద్దని ఇప్పటికే మా ఆదేశాల్లో స్పష్టంగా చెప్పాం. అయినా నోటీసులు ఇవ్వడానికి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు ఎంత ధైర్యం?'' అని నిలదీసింది. దీనిపై సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టంచేసింది. విద్యార్థుల విషయంలో అధికారులు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, ఆ నోటీసును తర్వాత ఉపసంహరించుకున్నా.. చేసిన నేరం నుంచి తప్పించుకోలేరని సీనియర్ న్యాయవాది బిశ్వజీత్ భట్టాచార్య చెప్పారు. విద్యార్థులపై చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని సీజేఐ తెలిపారు. గౌతమబుద్ధ విశ్వవిద్యాలయానికి చెందిన అక్షత్ త్రిపాఠి రూ.5 లక్షల వ్యక్తిగత పూచీకత్తు ఇవ్వాలని అధికారులు నోటీసు జారీచేశారు.

## భూతాపం పెరుగుదలలో భారత్ వాటా స్వల్పమే




భూతాపం పెరుగుదలలో 0.05 సెల్సియస్ డిగ్రీలకే భారత్ కారణమైందని బ్రిటన్‌లోని క్రాన్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వి.కె.పటేల్, ఐఐటీ ఖరగ్‌పూర్‌కు చెందిన పి.ఎ.తక్సల్‌ల అధ్యయనం తేల్చింది. అమెరికా దాదాపు 0.27 డిగ్రీల సెల్సియస్‌తో భూతాపానికి అతి పెద్ద కారకురాలిగా నిలిచింది. తర్వాతి స్థానంలో చైనా 0.19 డిగ్రీల సెల్సియస్ వాటాతో ఉంది. ఐరోపా సమాఖ్యవల్ల (ఈయూ) భూతాపం 0.17 డిగ్రీల సెల్సియస్ పెరగ్గా, రష్యావల్ల 0.070.08 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. అయితే బ్రిటన్, జపాన్, బ్రెజిల్, కెనడా, ఇండోనేసియా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాల కన్నా భారతదేశం కాస్త ఎక్కువగానే భూతాపానికి కారణమవుతోంది. 2024కు సంబంధించి పరిశోధకులు ఈ అధ్యయనం చేశారు.

భారత్‌వల్ల భూతాపం పెరగడమనేది 1990 నుంచే పెరిగింది. శిలాజ ఇంధనాల వినియోగంవల్ల ఏర్పడే కర్బన ఉద్గారాలే భూతాపం పెరుగుదలకు ప్రధాన కారణం. భారత్‌లో వ్యవసాయంవల్ల వెలువడుతున్న, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వాయువులు భూతాపాన్ని కొంత పెంచుతున్నాయి. భారత్‌వల్ల భూతాపం అతి తక్కువగానే పెరిగినప్పటికీ.. ఉష్ణమండల వాతావరణం, అధిక జనాభావంటి కారణాలవల్ల ఆ ప్రభావాన్ని ఎక్కువగా అనుభవిస్తోంది.



## చికెన్ పెట్టలేదని హెచ్‌ఎంను చావగొట్టిన టెన్త్ విద్యార్థులు

పశ్చిమ బెంగాల్‌లోని జిల్లా కేంద్రమైన జల్‌పాయిగుడిలో గల 150 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు ధరంచంద్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. 'ఉపాధ్యాయ దినోత్సవం' సందర్భంగా విద్యార్థులకు పెట్టాల్సిన ప్రత్యేక మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం వడ్డించారు. తమకు తగినంతగా చికెన్, అన్నం పెట్టలేదని కొంతమంది విద్యార్థులు హెచ్‌ఎంతో వాదనకు దిగగా.. ఆయన వారిపై చేయి చేసుకున్నారు. దీంతో కోపోద్రిక్తులైన విద్యార్థులు హెచ్‌ఎంను పాఠశాల ఆవరణలో ఉరికించి నేలపై పడేసి కొట్టారు. హెచ్‌ఎం గదిలో కొంత భాగాన్ని కూడా ధ్వంసం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని ధరంచంద్‌ను ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. అధికారులు పాఠశాల వద్ద ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు బుధవారం పాఠశాలను సందర్శించి వివరాలు ఆరా తీశారు.

## హద్దులు ఉండాల్సిందే..: చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీం

**చిన్నారులు సోషల్ మీడియా) వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు డిజిటల్ వేదికలను సులభంగా వినియోగించే అవకాశం ఉందని, అందుకే వారికి రక్షణ కల్పించేలా హద్దులు ఉండాల్సిందేనని సూచించింది. మైనర్లు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే విషయంలో రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ వేధింపుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.**



# పాక్‌కు తొలి మక్కా పరీక్ష!

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు ఇప్పుడు పశ్చిమాసియా సంక్షోభంతో పాకిస్థాన్ పెద్ద ఇరకాటంలో పడే ముప్పు కనిపిస్తోంది! సౌదీ అరేబియాపై హూతీ తిరుగుబాటుదారులు చేస్తున్న దాడులే ఇందుకు కారణం. మక్కా ఒప్పందానికి కట్టుబడి యెమెన్‌లో హూతీలపై ప్రస్తుతం పాక్ దాడులకు దిగుతుందా.. లేదంటే దాడులేమీ చేయకుండా ఒప్పందాన్ని అటకెక్కిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

హూతీల దెబ్బ

సౌదీ, హూతీల మధ్య వైరం కొత్తేదేమీ కాదు. యెమెన్‌లో హూతీలను అణచివేసేందుకు 2015లో సౌదీ ప్రయత్నించి విఫలమైంది. అది కాస్తా యెమెన్‌లో అంతర్యుద్ధానికి దారితీసింది. ఆ తర్వాతి నుంచి అడపాదడపా సౌదీ, హూతీల మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికాఇరాన్ యుద్ధం మొదలయ్యాక హూతీలూ అందులో జోక్యం చేసుకున్నారు. సౌదీపైకి డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించారు. ఆ దేశంలోని కీలక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నారు. వారి దాడులతో సౌదీలో మంగళవారం



73 మంది గాయపడ్డారు. రియాద్ కూడా ప్రతిదాడులు చేస్తోంది. హూతీల నిర్మూలనకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**పాక్ ఏమంటోంది?**

మక్కా ఒప్పందాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించబోమని పాక్ అంటోంది. యెమెన్‌లో హూతీలపై వైమానిక దాడులు జరిపేందుకు అది సిద్ధమవుతున్నట్లు కూడా తెలుస్తోంది. అయితే ఆ దాడులు రక్షణాత్మక ధోరణిలో ఉంటూ కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సౌదీ కోరుకుంటున్నట్లు యెమెన్‌లో హూతీలను పూర్తిగా అణచివేసేందుకు పాక్ సహకరించే అవకాశాలు లేవంటున్నారు.

**ఇరాన్ ఊరుకుంటుందా..?**

హూతీలకు ఇరాన్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంది. వారిపై పాక్ దాడులు చేస్తే టెహ్రాన్ ఆగ్రహించడం ఖాయం! అదే జరిగితే ఇస్లామాబాద్‌కు పెద్ద తలనొప్పిగా మారుతుంది. ఈ నేపథ్యంలో పాక్ ఆచి తూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది పాక్‌కు ఎదురైన తొలి 'మక్కా' పరీక్ష!

**మక్కా ఒప్పందం ఏం చెబుతోంది?**

తమ మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా.. దాన్ని మిగతా రెండు దేశాలపైనా జరిగిన దాడిగా భావించేలా సౌదీ, తుర్కియే, పాక్ గత నెలలో 'మక్కా ఒప్పందం' కుదుర్చుకున్నాయి. అంటే సౌదీపై హూతీల దాడులను పాక్, తుర్కియే తమపై దాడుల్లా పరిగణించాలి! రియాద్‌కు మద్దతుగా అవి రంగంలోకి దిగాలి. ఇక ఇస్లామాబాద్, రియాద్ మధ్య నిరుటి నుంచే వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం కూడా అమల్లో ఉంది.

## మురుగుకాల్వలా మారిన నదికి.. మరో జన్మ

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో చిన్న మురుగుకాలువ స్థాయికి క్షీణించిన చంద్రావల్ నది స్థానిక గ్రామస్థులు, రైతుల సాయంతో చేపట్టిన భారీ పునరుజ్జీవన కార్యక్రమంతో మళ్లీ కొత్త జీవం పోసుకొందని 'క్లీన్ గంగ జాతీయ మిషన్' (ఎన్‌ఎంసీజీ) బుధవారం వెల్లడించింది. వర్షాధారమైన ఈ నది మహోబా జిల్లాలో పుట్టి, హమీర్‌పూర్ జిల్లా మీదుగా 68 కి.మీ.లు ప్రయాణించి బాందా జిల్లా వద్ద కెన్ నదిలో కలుస్తుంది. పూడిక నిండి, కాలుష్యం వల్ల దాదాపుగా ఎండిపోయిన ఈ నది 2024 నాటికి గట్లకు ఇటూ అటూ ఉన్న రైతులకు ఓ జ్ఞాపకంగా మిగిలి ఉండేది. గతేడాది ప్రారంభంలో 'మిషన్ జలోదయ', 'నమామి గంగ' కార్యక్రమాల కింద నది పునరుజ్జీవన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నది ప్రవహించే మొత్తం భూభాగాన్ని 19 విభాగాలు చేశారు. ప్రతి విభాగం బాధ్యతను ఓ ప్రత్యేక అధికారికి అప్పగించారు. పూడిక తొలగించి, నదీగర్భాన్ని శుభ్రం చేయడంలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యంతో అద్భుతం సృష్టించారు. ఇరు గట్లపై మొక్కలు నాటారు. 2025 డిసెంబరు నాటికల్లా నదిలో మళ్లీ ప్రవాహం మొదలైంది. ఇప్పుడు చుట్టుపక్కల బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరిగి.. పైర్లు కళకళలాడుతున్నాయని 'క్లీన్ గంగ జాతీయ మిషన్' తెలిపింది.

## 17 నుంచి భాజపా సేవా సంకల్ప్ అభియాన్



- పార్టీ అధ్యక్షుడు నబీన్ వెల్లడి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారం చేపట్టి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని ఆయన పుట్టిన రోజైన ఈ నెల 17 నుంచి నెల రోజులపాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహించనున్నట్లు భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలిపారు. ఇందులో భాగంగా యువతతో మమేకం కావడంతోపాటు ప్రజల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత జనవరిలో భాజపా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నబీన్ మీడియా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై మాట్లాడారు. వందేమాతరం పూర్తిగా పాడటాన్ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్‌ది అరాచక మనస్తత్వమని నబీన్ విమర్శించారు. ఆ పార్టీది దేశ వ్యతిరేక విధానమని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రతిధ్వని వారి సొంత పార్టీ కార్యకర్తలను దాటి వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశంలోని యువత స్వయం సమృద్ధి దిశగా సాగుతున్నారని తెలిపారు. వారి ప్రతిధ్వని వారి పార్టీ కార్యకర్తల కోసమేనని, భాజపా ప్రతిధ్వని దేశంలోని 140 కోట్ల మంది ప్రజల కోసమని స్పష్టం చేశారు. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అరాచక పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ఆ రాష్ట్రంలో డ్రగ్స్‌పై భాజపా ప్రజా ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ అంశాలతోపాటు ఆప్ అవినీతి ఎజెండాగా పంజాబ్‌లో త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని వెల్లడించారు.

## కలసి పనిచేద్దాం



దక్షిణాసియా ప్రాంతీయ అభివృద్ధికి, శ్రేయస్సుకు సముద్ర మార్గాల భద్రత, స్వేచ్ఛా నౌకాయానం, అంతర్జాతీయ చట్టాలపట్ల గౌరవం కలిగి ఉండటం, అడ్డంకులు లేని సముద్ర వాణిజ్యం అత్యంత ప్రాధాన్యాంశాలుగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. నాగరికతపరంగా కవలలుగా, సన్నిహిత పొరుగు దేశాలుగా, సముద్రయాన భాగస్వాములుగా ఉన్న భారత్, శ్రీలంకలు తమ ప్రాంతంలోని భద్రత, రక్షణ, శాంతి, శ్రేయస్సును పెంపొందించేందుకు కలిసి పని చేయడాన్ని కొనసాగిస్తాయని పునరుద్ఘాటించారు. బుధవారం కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకేతో సమావేశం అనంతరం ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యూహాత్మకపరంగా అత్యంత కీలక ప్రదేశంలో శ్రీలంక ఉందని, హిందూ మహా సముద్రంలో రక్షణ కోసం ఇరు దేశాలు మరింతగా కలిసి పని చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా.. శ్రీలంక వైమానిక దళం కోసం ఎల్70 తుపాకుల ఉన్నతీకరణపై, నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ), నేషనల్ డిఫెన్స్ కాలేజీల సహకారంపై ఇరు దేశాల మధ్య 3 కీలక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదిరాయి. గత 40 ఏళ్లలో భారత రక్షణ మంత్రి శ్రీలంకలో పర్యటించడం ఇదే మొదటిసారి. 3 రోజుల పర్యటన కోసం మంగళవారం శ్రీలంకలోని కొలంబో చేరుకున్న రక్షణ మంత్రి బుధవారం ఆ దేశంలోని పలు సమావేశాల్లో పాల్గొన్నారు. ఇరు దేశాల నేతలు.. భారత రక్షణ మంత్రిత్వశాఖ శ్రీలంకలో నిర్మించిన 3 బెయిలీ బ్రిడ్జిలను వర్చువల్‌గా ప్రారంభించారు. రాజ్‌నాథ్ సింగ్ కొలంబోలోని భారతీయ శాంతి పరిరక్షక దళం (ఐపీకేఎఫ్) స్మారకాన్ని సందర్శించి, విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన భారత సైనికులకు నివాళులర్పించారు. తర్వాత శ్రీలంక రక్షణశాఖ కార్యాలయాన్ని సందర్శించి ఆ దేశ ఉన్నత స్థాయి నాయకత్వంతో సమావేశమయ్యారు.

## ఆ స్వరాలు 136 ఏళ్లుగా మధురం!



ఆ వయోలిన్ వయసు 136 ఏళ్లు.. అయినా ఇప్పటికీ మధుర స్వరాలు పలుకుతోంది. జర్మనీలో 1890లో తయారైన ఈ పురాతన వయోలిన్ పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్‌కు చెందిన సంగీతకారుడు శంఖదీప్ సేన్‌గుప్తా దగ్గర భద్రంగా ఉంది. ఇది సంగీతంతో పాటు స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను తరతరాలకు మోసుకొస్తోంది. వయోలిన్ పెట్టె లేబుల్ ప్రకారం దీనిని జర్మనీకి చెందిన హాఫ్ కంపెనీ తయారు చేసింది. శంఖదీప్ తాత మాణిక్ గుప్తా, మేనమామ సుశీల్ గుప్తా స్వాతంత్ర్య సమరయోధులు. బ్రిటిష్ పాలకుల చేతిలో జైలు శిక్ష అనుభవించిన సమయంలో సుశీల్ గుప్తా వయోలిన్ నేర్చుకున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా సాధన కొనసాగించారు. మేనమామ స్ఫూర్తితో సంగీతం నేర్చుకున్న శంఖదీప్ కొన్నేళ్ల తర్వాత పెట్టెలోంచి వయోలిన్‌ని తీసి.. మరమ్మతులు చేయించి మళ్లీ వాయించడం ప్రారంభించారు. ఈ సంగీత పరికరం మొత్తం ఒకే చెక్కముక్కతో తయారైంది. సన్నని ఆకారం.. వెడల్పాటి రూపం కారణంగా ఈ తంత్రిలో పలికే స్వరాలు ఎంతో మధురంగా ఉంటాయంటున్నారు శంఖదీప్. ఇలాంటి పురాతన వాయిద్యాలు విదేశాల్లో రూ.6 లక్షల పైన పలుకుతున్నా.. స్వాతంత్ర్య చరిత్రకు, కుటుంబ వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుండటంతో దీనిని తమ వారసులకే అందిస్తానంటున్నారు శంఖదీప్.

## వివాహం అంటే.. వ్యక్తిగత స్వేచ్ఛ కోల్పోవడం కాదు: సుప్రీం కోర్టు

అత్యంత వివాదాస్పదమైన వైవాహిక అత్యాచారం అంశంపై తుది విచారణ జరపనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. దీనికి సంబంధించి దాఖలైన పలు పిటిషన్లు మూడు వారాల తర్వాత విచారణకు వచ్చేలా తేదీని ఖరారు చేస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారం వెల్లడించింది. లైంగిక చర్యలో పాల్గొనేలా తనను బలవంతపెట్టాడంటూ మైనర్ కాని భార్య ఫిర్యాదు చేస్తే ఆ నేరారోపణ విచారణ నుంచి భర్తకు మినహాయింపును కొనసాగించాలా? వద్దా? అనే సంక్లిష్ట న్యాయపరమైన అంశాన్ని ధర్మాసనం పరిశీలించనుంది. ఐపీసీలోని సెక్షన్ 375లో భర్తకు కల్పించిన మినహాయింపును భారతీయ న్యాయ సంహిత(2023)లోనూ కొనసాగించడాన్ని ప్రశ్నించిన పిటిషన్లపైనా విచారణ జరపనుంది. ఒకవేళ భర్తకు లభించిన చట్టపరమైన మినహాయింపును కొనసాగిస్తే భార్య చేసిన నేరాభియోగాల పరిస్థితి ఏమిటనే అంశంతోపాటు ఇతర కోణాలనూ పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. వివాహమైనంత మాత్రాన 'భార్య లైంగిక బానిస' కాదంటూ భర్తపై విచారణను సమర్థించిన కర్ణాటక హైకోర్టు కేసును తొలుత పరిశీలిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన సభ్యులుగా ఉన్న ధర్మాసనం తెలిపింది. ఈ సందర్భంగా జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. 'వివాహం వల్ల ఒకవ్యక్తి తన స్వతంత్రతను కోల్పోవడం అనే ప్రశ్నే తలెత్తదు' అని పేర్కొన్నారు. వివాహిత మహిళల భద్రత, రక్షణ గురించి ప్రస్తావించారు.



# ఎక్కువ ఖర్చు చేస్తున్నామా?

ఒకే దేశం, ఒకే జనాభా. కానీ ఏ కొలబద్దతో చూస్తామన్నదాన్ని బట్టి దేశంలో 'పేదలు' 5.3శాతమూ కావచ్చు, 82.1శాతమూ కావచ్చు. ఈ వైరుధ్యం సంక్షేమం అవసరంపై చర్చను మరోసారి ముందుకు తెస్తోంది. ముఖ్యంగా, జాతీయ ఆహార భద్రతా చట్టానికి కేంద్ర ప్రభుత్వం 2026 జూన్‌లో ముసా యిదా సవరణ బిల్లును విడుదల చేసిన నేపథ్యంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సవరణలు మంచివా కావా అనే విషయాన్ని పక్కన పెడితే, ఈ చర్చలో తరచూ వినిపిస్తున్న ప్రశ్న ఒకటుంది: 'ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్నవేళ, దాదాపు 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇవ్వడం ఇంకా అవసరమా?'

ఈ ప్రశ్నకు ప్రధానంగా రెండు రకాల స్పందనలు వినిపిస్తాయి: ఇంత భారీ స్థాయిలో ఉచిత రేషన్ ఇవ్వడం ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించకుండా సంక్షేమంపై ఆధారపడేలా చేస్తోందనేది ఒక వాదన. మరోవైపు, దేశం నిజంగా అంతగా అభివృద్ధి చెందితే ఇన్ని కోట్ల మందికి ఉచిత ఆహారం ఎందుకు అవసరమవుతోందని ప్రశ్నిస్తూ, ఆర్థికవృద్ధి కథనాన్నే అనుమానించేది మరో వాదన. కానీ ఈ రెండు వాదనలూ ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోతున్నాయి: తీవ్రమైన పేదరికం నుంచి బయటపడటం, ఆర్థిక భద్రత సాధించడం ఒకటే కాదు. అందువల్ల ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ, పేదరికం తగ్గుతున్నప్పటికీ సంక్షేమం అవసరం తప్పనిసరిగా తగ్గిపోదు.

గత రెండు దశాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పెరిగిందన్నది వాస్తవం. అదే సమయంలో పేదరికం కూడా భారీగా తగ్గింది. ప్రపంచ బ్యాంకు 2025 జూన్‌లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, రోజుకు 3 డాలర్ల పేదరిక రేఖను ప్రమాణంగా తీసుకుంటే, 2011–12లో 27.1శాతంగా ఉన్న 'తీవ్రమైన పేదరికం' 2022–23 నాటికి 5.3శాతానికి తగ్గింది. కానీ కథ అక్కడితో పూర్తికాదు. పేదరికం తగ్గడం వేరు, ఆర్థిక భద్రత వేరు.

పేదరికాన్ని కొలిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఒకే ప్రమాణాన్ని ప్రపంచ బ్యాంకు ఉపయోగించదు. దిగువ–మధ్య ఆదాయ దేశాలకు పేదరిక ప్రమాణంగా నిర్ణయించిన 'రోజుకు 4.20డాలర్ల' లెక్కనే తీసుకుంటే, 2022–23లో భారత జనాభాలో 23.9శాతం మంది ఆ రేఖకు దిగువన ఉన్నారు. ఎగువ–మధ్య ఆదాయ దేశాలకు ఉపయోగించే 8.30 డాలర్ల ప్రమాణాన్ని తీసుకుంటే ఈ సంఖ్య ఏకంగా 82.1శాతానికి చేరుతుంది.

పేదరికానికి సంబంధించి 5.3శాతం, 23.9శాతం, 82.1శాతం అనే మూడు సంఖ్యలు ఒక కీలక వాస్తవాన్ని బయటపెడతాయి: ఏ ప్రమాణంతో కొలుస్తామన్నదాన్ని బట్టి 'పేద' అనే నిర్వచనం, ఆ పరిధిలోకి వచ్చే జనాభా – రెండూ పూర్తిగా మారిపోతాయి. తీవ్ర పేదరిక రేఖను దాటినంత మాత్రాన కోట్లాది మంది ఆర్థిక అభద్రత నుంచి బయటపడినట్లు కాదు.

ప్రముఖ రాజకీయ ఆర్థికవేత్త, భారతీయ వ్యవహారాలపై నిపుణుడు ప్రొఫెసర్ డియెగో మయోరానో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తారు. తీవ్ర పేదరికం నుంచి బయటపడినప్పటికీ, భారత జనాభాలో పెద్ద భాగం పేదరికానికి కొద్దిగా ఎగువన మాత్రమే జీవిస్తోందని; అనారోగ్యం, పంట నష్టం లేదా ఆదాయంలో అకస్మాత్తుగా వచ్చే దెబ్బలు వారిని మళ్లీ పేదరికంలోకి నెట్టగలవని ఆయన ఒక పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు.

ఒక కుటుంబం అధికారికంగా దారిద్ర్య రేఖకు పైన ఉండవచ్చు. ఇంట్లో మోటార్ సైకిల్, స్మార్ట్ ఫోన్ ఉండవచ్చు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతుండవచ్చు. బయటకు చూస్తే అది మధ్యతరగతి కుటుంబంలా కనిపించవచ్చు. కానీ ఆ కుటుంబంలో తీవ్రమైన అనారోగ్యం, ఉద్యోగం పోవటం లేదా పంట నష్టం సంభవిస్తే? ఒక్క సంఘటనే చిన్న పొదుపును తుడిచిపెట్టి, అప్పుల్లోకి నెట్టి, ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకునేలా చేసి, ఆ కుటుంబాన్ని మళ్లీ పేదరికంలోకి తోసేయవచ్చు. అందుకే పేదరికం తగ్గడం వేరు; ఆర్థిక భద్రత సాధించడం వేరు.

ఈ ఆర్థిక అస్థిరత ఎంతమాత్రం ఊహాజనితం కాదు. 'ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే' డేటాను ప్రపంచ బ్యాంకు విశ్లేషిస్తే ఒక విషయం స్పష్టమైంది– 2005 నుంచి 2012 మధ్య 27శాతం కుటుంబాలు పేదరికం నుంచి బయటపడగా, 7శాతం కుటుంబాలు తిరిగి పేదరికంలోకి జారిపోయాయి. ఈ కోణంలోనే 80 కోట్ల ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్యను కూడా చూడాలి. నిజానికి ఇది ప్రస్తుత పేదరికానికి సంబంధించిన ప్రత్యక్ష అంచనా కాదు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం గ్రామీణ జనాభాలో 75శాతం, పట్టణ జనాభాలో 50శాతం వరకు కవరేజ్ కల్పించాలన్న నిబంధనను బట్టి, 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్య దాదాపు 81కోట్లుగా ఉంది. కాబట్టి వీరందరినీ అత్యంత పేదలుగా చూడటం కంటే, వారిలో ఎంతమంది ఆహార భద్రత వంటి రక్షణలు లేకుండా ఒక అనారోగ్యం, ఉద్యోగ నష్టం లేదా ఆదాయపు దెబ్బను తట్టుకోగలరన్నదే అడగాల్సిన అసలు ప్రశ్న.

ఇన్ని సంవత్సరాలుగా సంక్షేమ పథకాలు అమలవుతున్నప్పటికీ ఈ అభద్రత ఇంకా ఉంటే సంక్షేమం విఫలమైందనుకోవాలా? అలా తేల్చడం తొందరపాటు. సంక్షేమం ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా భద్రమైన స్థితికి తీసుకెళ్లే ఏకైక సాధనం కాదు. ఆహార భద్రత, ఉపాధి హామీ, పింఛన్లు వంటి పథకాలు ఆర్థిక దెబ్బ వచ్చినప్పుడు కుటుంబం పూర్తిగా కిందపడిపోకుండా కనీస రక్షణను కల్పిస్తాయి. మనం గమనించాల్సింది– ఇవి లేకపోతే ఆ కుటుంబాలు ఎంత త్వరగా అప్పుల్లోకి, ఆకలిలోకి జారిపోతాయన్నది. అందువల్ల ఒక సంక్షేమ పథకం విజయాన్ని 'లబ్ధిదారుడు ఇంకా ఆర్థిక అభద్రతలోనే ఉన్నాడా?' అనే ఒక్క ప్రశ్నతో కొలవలేం. 'ఆ పథకం లేకపోతే వారి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉండేది?' అన్న ప్రశ్న కూడా అడగాలి.

దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు స్థిరమైన ఉపాధి, తగిన ఆదాయం, అందుబాటులో వైద్యం, విద్య వంటి అంశాలు అవసరమే. సంక్షేమం వాటికి పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాదు. కానీ ఆ స్థాయి భద్రత అందరికీ అందేంతవరకు, సామాజిక రక్షణ ఒక కీలకమైన ఆధారంగా ఉంటుంది.

మరి సంక్షేమంపై మనం నిజంగానే అధికంగా ఖర్చు చేస్తున్నామా? సంక్షేమ పథకాల పరిధి విస్తృతంగా ఉండటం వల్ల, దేశ సంపదలో అసాధారణంగా పెద్ద భాగాన్ని వాటికే ఖర్చు చేస్తున్నామనే అభిప్రాయం ఉంది. అయితే ఆర్థికవేత్త రీతికా ఖేరా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది ప్రధాన సంక్షేమ పథకాలపై గత రెండు దశాబ్దాల వ్యయాన్ని పరిశీలించారు. వారి లెక్కల ప్రకారం, ఒక్క కోవిడ్ సంవత్సరంలో మాత్రమే ఈ పథకాల మొత్తం వ్యయం జీడీపీలో 3శాతాన్ని దాటింది. 2023–24లో జీడీపీలో వీటి వాటా దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉన్న స్థాయికి పెద్దగా భిన్నంగా లేదు. ఈ పరిశీలన కొన్ని ప్రధాన పథకాలకే పరిమితమైనప్పటికీ ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: విస్తృత కవరేజ్ ఉన్నంత మాత్రాన మనం నిజంగా అధికంగా ఖర్చు చేస్తున్నట్లా?

కోట్ల మందికి ఒక పథకం చేరుతున్నప్పటికీ, ఒక్కో కుటుంబానికి అందుతున్న సహాయం వారి వాస్తవ అవసరాలతో పోలిస్తే పరిమితంగానే ఉండవచ్చు. అందువల్ల కేవలం లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే చూపిస్తూ సంక్షేమ వ్యయం తీవ్రభారంగా మారిందని తేల్చడం సరికాదు. దేశ ఆర్థిక సామర్థ్యంతో పోలిస్తే ఎంత ఖర్చు చేస్తున్నాం, ఆ ఖర్చు కుటుంబాలకు ఎంతవరకు ఆర్థిక రక్షణ కల్పిస్తోంది అన్నవే అసలైన ప్రశ్నలు.

చిన్న ఆర్థిక దెబ్బలకే కుటుంబాలు మళ్లీ పేదరికంలోకి జారే ప్రమాదం ఉన్నప్పుడు సంక్షేమాన్ని తగ్గించడం సరికాదు. కేవలం రేషన్ పంపిణీకే పరిమితం కాకుండా నాణ్యమైన ఉచిత వైద్యం, విస్తృత సామాజిక భద్రత వంటి వ్యవస్థలను అందించాలి. లబ్ధిదారుల సంఖ్య కంటే రక్షణ నాణ్యతను పెంచడమే ముఖ్యం.

# కరువు ముంగిట... నీటిలో వినాయక నిమజ్జనమా?

## అడుగంటిన జలాశయాలు.... ఆర్భాటంగా వినాయక నిమజ్జనాలు






డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

**దేశంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటే కరువు పరిస్థితులు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో జలాశయాలు అడుగంటిపోతున్నాయి. తెలంగాణలోని పలు నగరాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు కనిపిస్తున్నాయి. వేసవి కాలానికి ఇంకా ఆరు నెలల సమయం ఉండగానే పరిస్థితి ఇలా ఉంటే, మార్చి–ఏప్రిల్ నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడమే ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి అవసరాలకే ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో వ్యవసాయం, పశుపోషణ, పారిశ్రామిక అవసరాల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉంది.తెలంగాణలో వర్షపాతం లోటు 52 శాతంగా, ఆంధ్రప్రదేశ్‌లో 64 శాతంగా ఉందనే గణాంకాలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. వర్షా కాలంలోనే వర్షా భావం ఇంత తీవ్రంగా ఉంటే, రాబోయే వేసవిని ఎదుర్కోవడానికి ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.కానీ కరువు ముప్పుపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన ప్రభుత్వాలు కేవలం పరిస్థితి అదుపులోనే ఉందన్న ప్రకటనలు, ప్రెస్‌మీట్‌లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలకు ఉపక్రమించాలి. ముఖ్యంగా రైతులకు ఏ పంటలు సాగు చేయాలి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు ఏమిటి, నీటి సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, పంటల ఎంపికలో ఎలాంటి మార్పులు చేసుకోవాలి అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి.కరువు అంటే కేవలం తాగునీటి కొరత కాదు. అది ఆహార భద్రత, వ్యవసాయం, పశుసంపద, ఉపాధి, ప్రజారోగ్యం వంటి అనేక రంగాలపై ప్రభావం చూపే సంక్షోభం. అందుకే ప్రభుత్వాలు కరువు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా, కరువు రాకముందే నివారణ చర్యలు ప్రారంభించాలి.**

కరువు మధ్య భారీ గణేష్ విగ్రహాల నిమజ్జనమా?

ఒకవైపు ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాల్సిన పరిస్థితి నెలకొంటే, మరోవైపు గణేష్ ఉత్సవాల సందర్భంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి భారీ విగ్రహాలను ఏర్పాటు చేయడం, అనంతరం వాటిని నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం పర్యావరణ పరంగా తీవ్రంగా ఆలోచించాల్సిన అంశం.ఇప్పటికే అనేక చెరువులు, జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా తగ్గిపోయాయి. అలాంటి పరిస్థితుల్లో భారీ విగ్రహాలను ఎక్కడ, ఎలా నిమజ్జనం చేయాలన్నది ప్రభుత్వాలు ముందుగానే ప్రణాళిక చేయాలి. ముఖ్యంగా తాగునీటి వనరులు, చెరువులు, రిజర్వాయర్లు కలుషితం కాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాలు నీటిలో సులభంగా కరగకపోవడం వల్ల నిమజ్జనం అనంతరం నీటి వనరుల్లో ఘన వ్యర్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. విగ్రహాలకు ఉపయోగించే కొన్ని కృత్రిమ రంగులు, పూతలు కూడా నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. నిమజ్జనం జరిగే నీటి వనరులు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది.అందువల్ల గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా పాటించాల్సిన అవసరం ఉంది. భక్తి పేరుతో మన భవిష్యత్ తరాల నీటి వనరులను కలుషితం చేయడం సమర్థనీయం కాదు.

మట్టి విగ్రహాలే పర్యావరణహిత ప్రత్యామ్నాయం

సహజ మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాలను ప్రోత్సహించడం ఈ సమస్యకు ఒక ఆచరణాత్మక పరిష్కారం. మట్టి విగ్రహాలు నీటిలో తక్కువ సమయంలోనే విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉండటంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పోలిస్తే పర్యావరణంపై ప్రభావం తక్కువగా ఉంటుంది. సహజ, హానికర రసాయనాలు లేని రంగులను ఉపయోగించడం ద్వారా ఈ ప్రభావాన్ని మరింత తగ్గించవచ్చు.ప్రభుత్వాలు కేవలం ఉత్సవాల సమయంలో నిబంధనలు ప్రకటించడం కాకుండా, ముందుగానే విగ్రహ తయారీదారులను ప్రోత్సహించి పర్యావరణహిత మట్టి విగ్రహాల తయారీ, విక్రయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. స్థానిక సంస్థలు కృత్రిమ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగాన్ని నియంత్రించడంతో పాటు ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు చేయాలి. ఇది భక్తికి వ్యతిరేకమైన చర్య కాదు; భక్తిని ప్రకృతితో సమన్వయం చేసే బాధ్యతాయుతమైన విధానం. ఒకవైపు కరువు ముప్పును ఎదుర్కొంటూ ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలని చెబుతూ, మరోవైపు అదే నీటి వనరులను కాలుష్యానికి గురిచేయడం పరస్పర విరుద్ధమైన విధానం. కాబట్టి ఎల్‌నినో, వర్షాభావం, భవిష్యత్ నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు, ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలి. నీరు ఉంటేనే జీవనం... నీటిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.

# జలప్రళయానికి కారకులెవరు?

**నేపాల్‌లో పెనువిధ్వంసాన్ని సృష్టించిన తాజా జలప్రళయం- హిమాలయ ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను మరోసారి చర్చకు తెచ్చింది. అమెరికా జియొలాజికల్ సర్వే ప్రకారం హిమానీనదం బద్దలై భారీగా మంచు చరియలు, బండరాళ్లు విరిగిపడి లిండే ఖోలా నది ప్రవాహాన్ని అడ్డుకున్నాయి. ఆపై అది ఉప్పాంగి భోటే కోషి, త్రిశూలి నదుల్లోకి రాళ్లూ బురదతో కూడిన వరద పోటెత్తడంతో నేపాల్‌లోని పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. సునామీని తలపిస్తూ ఉవ్వెత్తున ఎగసిపడిన రాకాసి వరద దృశ్యాలు అందరినీ భీతిల్లజేస్తున్నాయి. ఈ ఉత్పాతం ధాటికి గల్లంతైన అభాగ్యుల్లో పలువురు భారతీయులు ఉండటంతో దేశీయంగా ఎన్నో కుటుంబాలు దుఃఖభరితమవుతున్నాయి. వరద విపత్తు ధాటికి తీవ్రంగా తల్లడిల్లుతున్న నేపాల్‌కు వెంటనే ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. మిగిలిన దేశాలూ చేయూతనందిస్తే ఆ హిమాలయ రాజ్యం త్వరగా తెప్పరిల్లుతుంది. అద్భుత సౌందర్యానికి నెలవులైన మంచు పర్వతాలు విపరీతంగా వేడెక్కుతున్నందునే ఇలాంటి ఉత్పాతాలు తరచూ సంభవిస్తున్నాయి!**



హిందూకుష్ హిమాలయ ప్రాంతంలో 19512020 మధ్య సగటు ఉష్ణోగ్రత ప్రతి దశాబ్దానికి సుమారు 0.28 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగింది. నాలుగువేల మీటర్లకు పైబడిన ప్రాంతాల్లో ఆ పెరుగుదల మరింత ఎక్కువగా 0.34డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తరాఖండ్, నేపాల్‌లతో కూడిన మధ్య హిమాలయాల్లో ప్రతి పదేళ్లకు ఉష్ణతాపం 0.4 డిగ్రీల సెల్సియస్ మేర అధికమవుతోంది. దానివల్ల చాలా చోట్ల మంచు కురవడం తగ్గిపోతోంది. హిమానీనదాలు వేగంగా కరిగి సరస్సులు ఏర్పడుతున్నాయి. అవి ఆకస్మికంగా బద్దలైనప్పుడు భీకర వరద కిందకి ఉరకలెత్తి ఊళ్లకు ఊళ్లను మింగేస్తోంది. మౌలిక వసతులను తుడిచిపెట్టేస్తోంది. 2013లో కేదార్‌నాథ్ అలాగే పెను నష్టాన్ని చవిచూసింది. అంతకు ముందు సిక్కిం, జమ్మూకశ్మీర్‌లోనూ అదే తరహా భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. అభివృద్ధి పేరిట రహదారులూ సొరంగాలూ హైడ్రోపవర్ ప్రాజెక్టులను విచ్చలవిడిగా నిర్మిస్తుండటంతో అసలే అస్థిరంగా ఉన్న హిమపర్వతాలు మరింత కుదుపునకు లోనవుతున్నాయి. దానివల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలు దండెత్తి కొండచరియలు విరిగిపడి ప్రాణ, ఆస్తినష్టాలు సాధారణమవుతున్నాయి. గడచిన మూడు దశాబ్దాల్లో హిందూకుష్ హిమాలయాల్లోని హిమానీనదాలు తమ మొత్తం విస్తీర్ణంలో 12శాతాన్ని, మంచు నిల్వల్లో తొమ్మిది శాతాన్ని కోల్పోయాయి. ముఖ్యంగా అర కిలోమీటర్ పరిమాణం లోపులోనివి వేగంగా కరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హిమానీనద సరస్సులు ఆందోళనకరంగా విస్తరిస్తూ ఆరు రాష్ట్రాల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని కేంద్ర జలసంఘం నివేదికాంశాలు నిరుడు హెచ్చరించాయి. ఒక్క హిమాచల్ ప్రదేశ్‌లోనే గత 35ఏళ్లలో అవి 107 నుంచి 669కి పెరిగి వినాశకర వరదల ప్రమాదాన్ని పెంచాయి. ఉపగ్రహాల సాయంతో అలాంటి వాటిని నిత్యం పర్యవేక్షిస్తుండాలి. అనుకోని విపత్తు తలెత్తితే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసే వ్యవస్థలను, తక్షణ ప్రతిస్పందన ఏర్పాట్లనూ సిద్ధం చేసుకోవాలి. హిందూకుష్ ప్రాంతంలో హిమానీ నదాలు ఇలాగే కరిగిపోతుంటే దాదాపు 200 కోట్ల మంది ఆహార, నీటి కొరతల్లోకి జారిపోయే ముప్పుంది. ఈ వాస్తవాన్ని ప్రభుత్వాలు అర్థం చేసుకుని హిమాలయాల సహజావరణ వ్యవస్థను దెబ్బతీస్తున్న మానవ చర్యలను కట్టడి చేయాలి!

# కాబూల్‌లో కొత్త సమీకరణాలు

**అఫ్గానిస్థాన్‌పై పట్టు బిగించడానికి దశాబ్దాల క్రితం అమెరికాతో కలిసి పాకిస్థాన్ ప్రారంభించిన కార్యక్రమం రోజురోజుకు ఎలా పట్టు కోల్పోతున్నదో తాలిబన్ల అయిదేళ్ల పాలన చాటిచెబుతోంది. ఇప్పుడు కాబూల్‌లో సమీకరణాలు పూర్తిగా మారిపోతున్నాయి. అమెరికా, పాక్‌లకు దూరమవుతూ వస్తున్న అఫ్గాన్- భారత్‌కు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తోంది.పాకిస్థాన్ పూర్వ అధ్యక్షుడు జనరల్ జియా-ఉల్-హక్ 1979లో పాక్ సైనిక గూఢచారి సంస్థ ఐఎస్ఐ అఫ్గానిస్థాన్ బ్యూరో అధిపతి లెఫ్టినెంట్ జనరల్ అక్తర్ అబ్దుల్ రహ్మాన్‌ఖాన్‌తో మాట్లాడుతూ, "అఫ్గానిస్థాన్‌లో నీరు సరైన ఉష్ణోగ్రత దగ్గర మరగాలి. అప్పుడు మాత్రమే మనం జోక్యం చేసుకోగలం" అని అన్నారు. సోవియట్లు అఫ్గాన్‌పై దండయాత్ర చేసిన సమయమది. అక్కడ వారు ప్రతిష్ఠించిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తున్న వారికి మద్దతు ఇవ్వాలని పాకిస్థాన్, అమెరికాలు నిశ్చయించాయి. కాలక్రమంలో సోవియట్లు అఫ్గాన్ నుంచి నిష్క్రమించారు. వారి తర్వాత అమెరికన్లు అఫ్గాన్‌లో 20 ఏళ్లకు పైగా కార్యకలాపాలు నిర్వహించినా, 2021లో తాలిబన్లకు పగ్గాలు వదిలేసి రాత్రికి రాత్రే వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత తాలిబన్లు అధికారంలో అయిదేళ్లు పూర్తిచేసుకున్నారు.**

పారని పాక్ పన్నాగం

వియత్నాం యుద్ధంలో అమెరికన్లపై పోరాడిన కమ్యూనిస్టు గెరిల్లాలకు సోవియట్ సాయం చేసినందుకు ప్రతిగా అఫ్గాన్‌లో సోవియట్లపై పోరుకు అమెరికా మద్దతు ఇచ్చింది. బ్రిగేడియర్ ఎం.యూసుఫ్, మేజర్ మార్క్ అడ్కిన్‌లు తమ పుస్తకం 'అఫ్గానిస్థాన్: ది బేర్ ట్రాప్'లో ఈ సంగతి వివరించారు. అఫ్గానిస్థాన్‌ను సోవియట్ల పాలిట వియత్నాంగా మార్చడమే అమెరికా లక్ష్యమని తెలిపారు. బ్రిగేడియర్ యూసుఫ్ ఐఎస్ఐ అఫ్గాన్ బ్యూరోలో కీలక పాత్ర పోషించేవారు. సోవియట్ సేనలపై పోరాడుతున్న ముజాహిదీన్లకు అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ డబ్బు, ఆయుధాలు సమకూర్చేదని ఆయన వెల్లడించారు. అప్పట్లో భారీగా దుస్తులు, ఆహార పదార్థాలను కొనుగోలు చేసి హిందూకుష్ పర్వత శ్రేణి దక్షిణ, తూర్పు భాగాలకు పంపేవారు. అదంతా పష్తు భాష మాట్లాడే అఫ్గాన్ గెరిల్లాల అడ్డా. హిందూకుష్‌కు ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో నివసించే తాజిక్‌లు, హజారాలు, ఉజ్బెక్‌లకూ సహాయం అందించేవారు. వారు అక్కడ దరి (పారశీక) భాష మాట్లాడతారు. అఫ్గాన్‌పై అమెరికా దండయాత్ర తర్వాత పష్తున్‌ల సంఖ్యాధిక్యత గల ప్రాంతాలు తాజిక్, హజారా వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాయి. అమెరికన్లు శిక్షణనిచ్చి మద్దతు ఇచ్చిన ఉత్తర దళాలు తర్వాత తాలిబన్లతో తలపడ్డాయి. బాహ్య శక్తులు తమను అణచివేయడానికి చేసే ప్రయత్నాలను పష్తున్‌లు చారిత్రక కాలం నుంచి ప్రతిఘటిస్తూనే వస్తున్నారు. ఈ వాస్తవాన్ని అమెరికన్లు విస్మరించినట్లు కనిపించారు. మరోవైపు బ్రిటిష్ వారు కూడా అఫ్గాన్ తెగలు, వంశాలను తమ నియంత్రణలోకి తెచ్చుకోలేక ఇబ్బంది పడ్డారు.

సోవియట్లపై పోరాడిన అఫ్గాన్ ముజాహిదీన్లకు ఇస్లామాబాద్ మద్దతు ఇచ్చినప్పుడు దాని అజెండా వేరే. అప్పట్లో భారత్, సోవియట్ యూనియన్‌ల మైత్రి తనను వ్యూహాత్మకంగా ఇరుకున పెడుతుందని పాకిస్థాన్ భయపడింది. మరోవైపు అమెరికన్లకు సోవియట్ సహజ శత్రువు. వియత్నాంలో తనకు జరిగిన శాస్తి, అఫ్గాన్‌లో సోవియట్‌కు జరగాలని అమెరికా లక్షించింది. తదనుగుణంగా అఫ్గాన్ ప్రతిఘటనకు మద్దతు ఇచ్చింది. ఈరోజు గాజాపై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు వాషింగ్టన్ ఎంతటి ఉత్సాహంతో మద్దతు ఇస్తోందో, అంతేస్థాయిలో అమెరికా అప్పట్లో అఫ్గాన్ ప్రతిఘటనకు మద్దతు ఇచ్చేది. సోవియట్లపై అఫ్గాన్ పోరాటానికి అమెరికా కాంగ్రెస్ అపార నిధులు సమకూర్చింది. సోవియట్లపై పోరాటానికి మార్గదర్శకులుగా ఐఎస్ఐ అక్కడ పాక్ సైన్యాధికారులను నియోగించింది. సోవియట్ ఓటమి తర్వాత అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ ఆధిపత్యాన్ని, ప్రభావాన్ని ప్రతిష్ఠించుకోవాలనే లక్ష్యంతో వీరిని నియమించారు. పాకిస్థాన్ సైన్యం గూఢచర్య సమాచారాన్ని సేకరించడానికి, అఫ్గాన్లకు సహాయం అందించడానికీ తమ సొంత వ్యక్తులను అఫ్గానిస్థాన్‌కు పంపింది. వారిలో చాలామంది అదృశ్యమయ్యారు లేదా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు.

గణనీయమైన మార్పు...

తాలిబన్లు అఫ్గాన్ మహిళల హక్కులను హరిస్తున్నారని అమెరికా సహా పశ్చిమ దేశాలు పదే పదే విమర్శిస్తుంటాయి. అఫ్గాన్ ఆక్రమణ సమయంలో సోవియట్లు మహిళా హక్కులకు ప్రాధాన్యం ఇచ్చారు. అప్పట్లో సోవియట్ మద్దతుతో నడిచిన అఫ్గాన్ ప్రభుత్వం మహిళలకు విద్యాఉపాధి అవకాశాలు కల్పించింది. అయితే ఈ ప్రగతిశీల విధానాలను తమ సంస్కృతి, సంప్రదాయాలపై దాడిగా అఫ్గాన్‌లోని సంప్రదాయ వర్గాలు భావించాయి. చివరికి సోవియట్లు శిక్షణ ఇచ్చిన అఫ్గాన్ సైన్యం కూడా వారికి వ్యతిరేకంగా మారింది. ఇప్పుడు తాలిబన్ల నియంత్రణలో ఉన్న అఫ్గాన్ భారతదేశం, రష్యా, చైనాలతో సన్నిహిత సంబంధాలను అభివృద్ధి చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు పాకిస్థాన్, అమెరికాలతో ఆ దేశ సంబంధం జటిలంగా మారింది. తాలిబన్ ప్రభుత్వం అయిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలకు దిల్లీలోని అఫ్గాన్ రాయబారి కార్యాలయం భారత దౌత్యవేత్తలను ఆహ్వానించింది. మారుతున్న సమీకరణాలకు ఇది నిదర్శనం.

మరోవైపు అఫ్గాన్, పాక్ దళాల మధ్య సరిహద్దు ఘర్షణలు వాటిమధ్య దూరం పెంచాయి. తాలిబన్ నాయకుడు అమీర్ ముత్తాఖీ 2025లో భారతదేశాన్ని సందర్శించడం, ఇస్లాం మతాధికారులను కలవడానికి ఉత్తర్ ప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌కు వెళ్లడం ప్రాంతీయ సమీకరణాలలో గణనీయమైన మార్పును సూచిస్తోంది. ముత్తాఖీ పర్యటన కచ్చితంగా పాకిస్థాన్‌ను కలవరపెట్టి ఉండవచ్చు. తాలిబన్లు దిల్లీలో పాత్రికేయుల సమావేశం నిర్వహించడం, అందులో పాల్గొనడానికి మహిళా జర్నలిస్టులను అనుమతించడం భారత్, తాలిబన్ల మధ్య ఏర్పడిన అవగాహనను సూచిస్తోంది. సీఐఏ, ఐఎస్ఐలు ఒకప్పుడు తాలిబన్లను భారత్, రష్యాలకు దూరంగా ఉంచాలని తాపత్రయపడేవి. కానీ, ఇప్పుడు దానికి భిన్నంగా జరుగుతోంది. జియాఉల్‌హక్ అఫ్గాన్‌లో నీరు 'సరైన ఉష్ణోగ్రత' దగ్గర మరగాలని కోరుకున్నా, ఇప్పుడది సలసలా కాగిపోతూ చేతిని కాల్చేసే స్థితికి చేరుకుంది. అఫ్గాన్‌లో ఉష్ణోగ్రతను నియంత్రించగలమని ఒకప్పుడు నమ్మిన శక్తులు ఇప్పుడు మారిన పరిణామాలలో నెగ్గుకురావడానికి కష్టపడుతున్నాయి.

అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | అనంతపురం | 11.09.2026 | 01

## 100మంది గర్భవతులకు భోజనం ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ వి ఉమేష్

**అగళి సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**



మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల జెడ్పీటీసీ వి ఉమేష్, గర్భవతులకు పోస్తికరమైన ఆహారాన్ని ఏర్పాటు చేశారు.గర్భవతుల దినం సందర్భంగా మన ఆగళి జడ్పీటీసీ ఉమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ తన ఆరోగ్యం గురించి బాగా శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ తెలిపే సూచనలు అనుసరించాలని మరియు ఆరోగ్యపరీక్ష కోసం వచ్చివెళ్లే వారు ఆకలితో ఉండకూడదని,తల్లి బిడ్డల ఆరోగ్య చాలా ముఖ్యమని హాస్పిటల్ కు వచ్చి తిరిగి ఎవరు ఆకలితో వెళ్లకూడదని అందరికి దాదాపు 100 మందికి భోజనాల ఏర్పాటు చేశారు. ఇకపై ప్రతి నెల తానే భోజనం ఏర్పాటు చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరిగేపల్లి శ్రీవాస్,మండల కో ఆప్షన్ మెంబర్ శివన్న,మైనరటి సంగం అధ్యక్షుడు సౌకత్ అలీఖాన్,పోస్ట్ రాజు మరియు జయప్ప మరియు ఆశ వర్కర్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తుది దశకు పెదపెంకి అభివృద్ధి పనులు

- 27 సిమెంటు రోడ్లు, 6 సిమెంటు డ్రెయిన్ల నిర్మాణం పూర్తి
- సుమారు రెండు కిలోమీటర్ల మేర 41 మ్యాజిక్ డ్రెయిన్లు
- 3 వేలకు పైగా మొక్కలతో సుందరీకరణ పనులు
- రూ. 4.68 కోట్లతో పెదపెంకి గ్రామాభివృద్ధి
- దశాబ్దాల బోదకాలు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అడుగులు
- గ్రామస్తుల వ్యక్తిగత హెల్త్ ప్రొఫైల్స్ ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు జారీ
- పనుల్లో నాణ్యత – ప్రజల సౌకర్యానికే పెద్దపీట వేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశం

**అమరావతి సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**



పార్వతీపురం మన్యం జిల్లా, పెదపెంకి గ్రామంలో ప్రత్యేకంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత, ప్రజల సౌకర్యానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యం ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఉండకూడదని, సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించే విధంగా ఉండాలని సూచనలు చేశారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన తర్వాత నిర్వహణా లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రజల్లో కూడా పారిశుధ్యం పట్ల అవగాహన కల్పిస్తూ, మార్పు తీసుకురావాలని చెప్పారు. రూ. 4.68 కోట్ల ఉపాధి హామీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం, మండల పరిషత్, నీటిపారుదల శాఖ తదితర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఏళ్ల తరబడి బోదకాలు వ్యాధితో బాధపడుతున్న పెదపెంకి గ్రామంలో పారిశుధ్య లోపాలు సరిచేయడంతో పాటు గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. గ్రామంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అవసరమైన వాతావరణం కల్పించే దిశగా చేపట్టిన ఈ పనులు తుది దశకు చేరినట్టు అధికారులు తెలియజేశారు. గ్రామంలో రూ. 4.68 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 27 అంతర్గత సిమెంటు రోడ్ల నిర్మాణం, 12 సిమెంటు డ్రెయిన్లు, ఆరు డ్రెయిన్ కమ్ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గ్రామంలో పూర్తి చేసిన అంతర్గత సిమెంటు రోడ్ల పొడుగు దాదాపు కిలోమీటరు ఉండగా, డ్రెయిన్లు కిలోమీటరున్నర వరకు ఉన్నాయి. మురుగు నివారణ, పారిశుధ్య చర్యల్లో భాగంగా నిర్మాణం చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్లు 48కిగాను 41 నిర్మాణం పూర్తయినట్టు వివరించారు. గ్రామంలోని తెలగ వీధి, కొత్త వీధి, పెద్ద వీధి, చీకటి వీధి, పిలక వీధి, ఎన్టీఆర్ కాలనీ, మెయిన్ వీధి, ఎస్టీ కాలనీలలో నిర్మించిన సీసీ ఓపెన్ డ్రెయిన్లు, మ్యాజిక్ డ్రెయిన్లు మురుగు నీటి సమస్యలను గణనీయంగా తగ్గించాయని, బంకూరు వీధి మరియు చీకటి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో ప్రజల రాకపోకలు సులభతరమయ్యాయని వెల్లడించారు. పూర్తయిన మ్యాజిక్ డ్రెయిన్ల పొడుగు రెండు కిలోమీటర్ల వరకు ఉంది. మరో 670 మీటర్లలో నిర్మిస్తున్న ఏడు మ్యాజిక్ డ్రెయిన్లు కూడా దాదాపు పూర్తి కావచ్చినట్టు తెలిపారు. దీంతోపాటు రోడ్లకు ఇరువైపులా కొబ్బరి చెట్లు, కోనేరు సుందరీకరణ తదితర పనుల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 3,000 వరకు మొక్కలు నాటినట్టు చెప్పారు. రోజుల వ్యవధిలో పూర్తి స్థాయిలో రోడ్లు, డ్రెయిన్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉంటాయని వివరించారు.పారిశుధ్యం, నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా వ్యక్తిగత, సామాజిక ఇంకుడు గుంతలు, కంపోస్ట్ పిట్స్ పనులు కూడా చేపట్టినట్టు తెలిపారు. బోద కాలు సమస్య తీవ్రత నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రివర్యుల



ఆదేశాల మేరకు పెదపెంకిలో ప్రతి గ్రామస్తుడికీ వ్యక్తిగత హైల్త్ ప్రొఫైల్స్ సేకరించి, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్స్ రూపొందించినట్టు వివరించారు.పెదపెంకి గ్రామంలో అభివృద్ధి పనులు ముందుకు తీసుకువెళ్లేందుకు ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదుర్కొని ముందుకు తీసుకువెళ్లిన అధికారులను పవన్ కళ్యాణ్ అభినందించారు. త్వరలో పెదపెంకిలో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని, నిర్మించిన రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెదపెంకి గ్రామాన్ని పారిశుధ్యం,
మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## "ఫరెవర్ మిస్ యూనివర్స్ ఇండియా 2025" విజేత డాక్టర్ సృజనా దేవికి మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు



- విశాఖపట్నం పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ ను కలిసిన డాక్టర్ సృజనా దేవి

**విశాఖపట్నం సెప్టెంబర్ 10,అనంత జనశక్తి న్యూస్**

వైద్య, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందిస్తూ అందాల పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విశాఖపట్నానికి చెందిన ప్రముఖ అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ ఎం. సృజనా దేవి "ఫరెవర్ మిస్ యూనివర్స్ ఇండియా 2025" టైటిల్‌ను కైవసం చేసుకోవడం పై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు..రాజస్థాన్‌లోని జైపూర్‌లో 'ఫరెవర్ స్టార్ ఇండియా' (FSIA) నిర్వహించిన జాతీయ స్థాయి ఆఖరి ఘట్టంలో దేశవ్యాప్తంగా పాల్గొన్న వేలాది మంది పోటీదారులను వెనక్కి నెట్టి ఆమె ఈ విజయాన్ని సొంతం చేసుకోవడం గొప్ప విషయం అన్నారు.ఈ సందర్భంగా విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ని డాక్టర్ సృజనా దేవి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. డాక్టర్ సృజనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..."వైద్యురాలిగా, సామాజిక కార్యకర్తగా ఇప్పటికే సమాజంలో తనదైన ముద్ర వేసిన డాక్టర్ సృజనా దేవి, మోడలింగ్, ఫ్యాషన్ రంగంలో జాతీయ స్థాయిలో కిరీటం గెలుచుకోవడం ఎంతో అభినందనీయం. మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకుంటూ అద్భుత విజయాలు సాధించడం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. భవిష్యత్తులో సృజనా దేవి మరిన్ని అంతర్జాతీయ పురస్కారాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను." అన్నారు.మంత్రి దుర్గేష్‌ను కలిసిన వారిలో ఏపీ ఛాంబర్స్ సలహాదారు లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ ఎం.వి.పవన్ కార్తీక్, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వి.స్వామి ఉన్నారు..

# ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని మీరా డీఎస్సీ గురించి మాట్లాడేది

- వైసిపి నేతలపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం
- 20 మందికి రూ.17.82 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన దగ్గుపాటి
- గత ఐదేళ్లలో 80లక్షలు కూడా ఇవ్వలేదన్న ఎమ్మెల్యే
- కరవు ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా మార్చారన్న ఎమ్మెల్యే

**అనంతపురం సెప్టెంబర్ 10,అనంత జనశక్తి న్యూస్**



గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టులు కూడా భర్తీ చేయని నాయకులు.. ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 35వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 20 మందికి 17 లక్షల 82వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు 713 మందికి 7కోట్ల 12లక్షల రూపాయల మేర ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కేవలం రెండేళ్లలోనే ఇంతమందికి సాయం చేశామని.. అయితే గత వైసీపీ పాలనలో కనీసం 80 లక్షల రూపాయలు కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించలేదన్నారు.
గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి వెళ్లిపోతే.. కేవలం ఏడాదిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఓవైపు మంత్రి నారా లోకేష్ ఇంకోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వలన రాష్ట్రానికి 25 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో రాయలసీమ అంటే కరవు ప్రాంతంగా చెప్పుకునే వారని ఇప్పుడు అదే ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా మార్చారన్నారు. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు ప్రతిష్టాత్మక కంపెనీలు తీసుకొచ్చారన్నారు.
పుట్టపర్తి ప్రాంతానికి లక్ష కోట్ల పెట్టుబడితో డిఫెన్స్ ఇండస్ట్రీని తీసుకొచ్చారన్నారు. తద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకంతోనే 16,347 పోస్టుల ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశారన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియను 148 రోజుల్లో పూర్తి చేశారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరే విధంగా మార్పులు తీసుకొచ్చారన్నారు. గతంలో ఉపాధ్యాయులను బాత్రూంల వద్ద, వైన్ షాపులు వద్ద ఉంచి అవమానించిన వైసీపీ వారు ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారన్నారు. అసలు వారికి డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. హంద్రీనీవా గతంలో కేవలం 1800 క్యూసెక్కులు మాత్రమే ఉండేదని.. ఇప్పుడు ఏకంగా 4వేల క్యూసెక్కులకు పెంచి శ్రీశైలం నుంచి నీరు తీసుకొస్తున్నారన్నారు.
అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. 250 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో మరో 310 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు.

## పారదర్శకతకు పెద్ద పీట వేసి.. పేద కుటుంబాలకు అండగా నిలిచాం..ఎమ్మెల్యే అమిలినేని



- వైసీపీ ప్రభుత్వంలో పోస్టును బట్టి డబ్బులకు ఉద్యోగాలు అమ్ముకున్నారు..
- పేద ప్రజలకు అండగా నిలిచి వారికి సేవ చేసేందుకు మా ప్రభుత్వం మేము పనిచేస్తున్నాం
- ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసి ఎక్కడా ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పేద కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి వారికి అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదికలో కంబదూరు, కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ ల పరిధిలోని 38 మందికి అంగన్వాడీ ఆయాలుగా ఉద్యోగ నియామకాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చేతుల మీదుగా అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అవినీతికి మారుపేరుగా ఉండి అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులకు రేటు పెట్టి మరి పేదలతో ఆడుకున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సంస్కృతికి తెరదించి పారదర్శకతకు పెద్ద పీట వేసామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో పేద ప్రజలకు అండగా నిలబడటం కోసం పనిచేస్తున్నామని తెలిపారు..ఎక్కడ ఏ ఒక్కరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా, పేద కుటుంబాలకు ఉద్యోగాన్ని అందించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు..ఎలాంటి పొరపాట్లకు, చిన్నారులకు సక్రమంగా అన్ని అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఉద్యోగాలు పొందిన వారికి సూచించారు...

## చేనేత కుటుంబాల ఇళ్లకు నేరుగా

- వెళ్లి సమస్యలు తెలుసుకున్న కేతిరెడ్డి....

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలో ప్రజా సమస్యలను తెలుసుకునే తన కార్యక్రమాన్ని వైస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కొనసాగించారు. నేడు (10.09.2026) ధర్మవరం పట్టణంలోని 4వ వార్డు కదిరిగేటు దిగువ ప్రాంతంలో "గుడ్ మార్నింగ్ ధర్మవరం"కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కుటుంబాల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి జీవన పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
అదే విధంగా వార్డు ప్రజలను కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల ఇబ్బందులు, ప్రజలకు ఎదురవుతున్న ఇతర సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్-16 బాలుర విభాగంలో ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వై. అశోక్ బాబు, జి. సాయి ప్రసాద్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం రామకృష్ణప్ప తెలిపారు. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు మార్కాపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



## ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు పొడిగింపు

**2029 డిసెంబర్ 31 వరకు అక్రిడిటేషన్ కొనసాగింపు**

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని అన్ని కోర్సులకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌ను 2029 డిసెంబర్ 31 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. గుర్తింపు పునరుద్ధరణలో భాగంగా జూన్ 28న ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌బీఏ అధికారులు కళాశాలను సందర్శించి, అక్కడి వసతులు, విద్యా ప్రమాణాలు, రికార్డులను పరిశీలించారు. కళాశాలలోని ఏర్పాట్లపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేసిన అనంతరం గుర్తింపును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు పొడిగింపునకు కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను ప్రిన్సిపాల్ సురేష్‌బాబు అభినందించారు. కళాశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు.

# పెదకోట అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసంపై అవగాహన



అనంతగిరి సెప్టెంబర్ 10:అనంత జనశక్తి న్యూస్

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ పరిధిలోని పెదకోట అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదకోట సెక్టార్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రోజువారీ ఆహారంలో నూనె, చక్కెర, ఉప్పును పరిమితంగా, సరైన మోతాదులో వినియోగించాల్సిన అవసరం ఉందని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పోషకాహారానికి సంబంధించిన అవగాహన సామగ్రిని ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోషణ మాసంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలో పోషణ్ మేళాలు, వంటకాల ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా స్థానికంగా లభించే ఆహార పదార్థాలతో పోషక విలువలు కలిగిన ప్రాంతీయ వంటకాలను తయారు చేసి ప్రదర్శించాలని సూచించారు. THR వంటకాలు, HCM మెనూతో పాటు స్థానిక ఆహార పదార్థాలతో తయారు చేసే వంటకాలను ప్రదర్శించాలని, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు.అంగన్వాడీ కార్యకర్తలు "పోషణ ప్లేట్" ద్వారా సమతుల్య ఆహారంలోని వివిధ రకాల పోషక పదార్థాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. స్థానికంగా లభించే చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని అవగాహన కల్పించారు.పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను చిన్న వయస్సు నుంచే పెంపొందించడమే పోషణ మాసం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సూపర్‌వైజర్ సునీత తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, ఘర్భిణీ స్త్రీలు, బాలింతలు, గ్రామస్తులు, పిల్లలు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



**- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి...**

**- రైతులకు నూతన పట్టా దారు పాస్ పుస్తకాలు పంపిణీ......**

కొత్తచెరువు రూరల్ సెప్టెంబర్ 10 అనంత జన శక్తి న్యూస్.

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి, పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండల పరిధిలోని, వేములేటి పల్లి, మరకుంటపల్లి గ్రామాల్లో నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ గురువారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని రైతులకు నూతన పట్టా ప పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని , ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుందని, గతంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో ఎన్నో లోసుగులు ఉండేవని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి రైతన్నలకు మేలు చేసే విధంగా తన భూమి తనకే పట్టా ఇచ్చి ఆదుకుంటుందని తెలిపారు. వీటికి తోడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని అభివృద్ధిని చూసి ఓర్వలేక వైఎస్సార్సీపీ నాయకులు ప్రభుత్వంపై అబాండాలు మోపుతున్నారని తెలిపారు

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ ,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, రెవెన్యూ అధికారులు, స్థానిక తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "జన్మనిస్తూ ఏ తల్లి మరణించరాదు. జన్మించిన ఏ శిశువు మరణించరాదు



పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 10 అనంత జన శక్తి న్యూస్.

**జిల్లాలో జన్మనిస్తూ జన్మనిస్తూ ఏ తల్లి మరణించరాదని జన్మించిన శిశువు మరణానికి గురికారాదని, శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేర్కొన్నారు... మాతా శిశు మరణాల**

**సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం. ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ప్రవేక్షులు ఆశ ఆరోగ్య అంగన్వాడీ కార్యకర్తల ఉద్దేశించి ఇరు శాఖలు సమన్వయంతో పనిచేసి మాతా శిశు మరణాలను నిలువరించాలని సూచించారు . గర్భస సమయంలోను ప్రసవానంతరము ఆశ ఆరోగ్య కార్యకర్తలు తప్పనిసరిగా గృహ దర్శనములు చేసి అవసరమైన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల వద్ద అన్ని పరీక్షలు చేయించాలని సాధారణ**

**ప్రసవానంతరం అర గంటలోపే తల్లిపాలు బిడ్డకు తాపించాలని తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సూచించారు. అప్పడే పుట్టిన బిడ్డ కు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు**

**ఆగస్టు మాసంలో జరిగినటువంటి ఒక మాతృ మరణము 11, శిశు మరణాలు సంభవించాయి. మాతా శిశు మరణాలను అరికట్టుటకు ప్రతి ఒక్కరూ తప్పక కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రీకాంథీ. గైనకాలజిస్ట్ నేహాతబుసుం. చిన్నపిల్లల డాక్టర్ సాయికుమార్, డిఐఓ డాక్టర్ చెన్నారెడ్డి, డిపిహెచ్ఎన్ఓ వీరమ్మ, డిప్యూటీ డెమో సుబ్రహ్మణ్యం, 108 కోఆర్డినేటర్ ప్రసాద్, పిహెచ్సి వైద్యులు పర్యవేక్షకులు ఆరోగ్య కార్యకర్తలు ఆశ అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.**

# రీసర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ

**- రైతులు, గ్రామస్థులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి.....**

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం డివిజన్ పరిధిలోని కుంటూరు, కనుముక్కల, మేడాపురం గ్రామాల్లో కొనసాగుతున్న రీసర్వే పనులను ఆర్డీఓ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులతో మాట్లాడిన ఆర్డీఓ.. రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా జాయింట్ ఎల్‌పీఎంల విభజన (జాయింట్ ఎల్ పి ఎం స్ప్లిటింగ్ ) ప్రక్రియలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భూమి హక్కులు, విస్తీర్ణం, అనుభవం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే వివరాలను నమోదు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా రీసర్వే పనులు చేపట్టాలని ఆదేశించారు.

రైతుల భూములకు సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను నిశితంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రక్రియను రైతులు, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రీసర్వే ఒక మంచి అవకాశమన్నారు. ప్రతి రైతు తమ భూమికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులకు అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రీసర్వే సమయంలో భూమి హక్కులు, విస్తీర్ణం లేదా ఇతర సమస్యలు ఉన్నట్లయితే వాటిని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, తద్వారా సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఆర్డీఓ సూచించారు.

# ఒనుకొండలో జనసేన బృందం పర్యటన

**- గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్న మండల అధ్యక్షులు చిట్టం మురళి**

**అనంతగిరి,సెప్టెంబర్ 10:అనంత జనశక్తి న్యూస్**



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం లంగుపర్తి పంచాయతీ పరిధిలోని ఒనుకొండ గ్రామంలో జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి ఆధ్వర్యంలో జనసేన పార్టీ బృందం పర్యటించింది. గ్రామంలోని ప్రతి వీధిలో తిరుగుతూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రధానంగా మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జనసేన నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వేసవి కాలంలోనే కాకుండా ఇతర సమయాల్లోనూ తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.ప్రజల సమస్యపై స్పందించిన చిట్టం మురళి వెంటనే సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఫోన్ చేసి ఒనుకొండ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

**రోడ్డు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి**

గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల నిత్యజీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. అత్యవసర సమయాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. గ్రామ అభివృద్ధికి రహదారి నిర్మాణం ఎంతో అవసరమని మురళిని కోరారు.

**గెడ్డ అడ్డుగా.. బ్రిడ్జి కోసం గ్రామస్తుల డిమాండ్**

మరో ప్రధాన సమస్యగా గ్రామానికి వెళ్లే మార్గంలో గడ్డ అడ్డుగా ఉండటంతో బ్రిడ్జి అవసరం ఉందని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు అక్కడ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరారు.గ్రామస్తుల సమస్యలను ఓపికగా విన్న చిట్టం మురళి మాట్లాడుతూ, ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అవసరమైన సమస్యలను జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లి పరిష్కారానికి

కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మంచినీరు,

రోడ్లు, బ్రిడ్జిలు ప్రజల ప్రాథమిక అవసరాలని, వీటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ పర్యటనలో జనసేన పార్టీ మండల నాయకులు పాంగి లక్ష్మణ్, సాగర మధు, ఎగువ శోభ పంచాయతీ కార్యదర్శి కొర్ర మోహన్ చంద్రతో పాటు గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. తమ సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారులతో మాట్లాడిన జనసేన మండల అధ్యక్షులు చిట్టం మురళికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యామ్నాయ పంటలను వేసుకోండి..ఎమ్మెల్యే అమిలినేని



**- వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం**

కళ్యాణదుర్గం సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్

ఎల్ నినో ప్రభావం కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదిక నందు జేడీఏ సాలు రెడ్డి, ఏడీఏలు, ఏఓల తో వ్యవసాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే సీడ్ బాల్స్ వేసేందుకు చర్యలు చేపడుతోందని, అలాగే ప్రత్యామ్నాయ పంట విత్తనాలు ఉలవలు, అలసందలు లాంటివి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోందని, ఎవరు కూడా ఇతర పంటలు వేసుకుని నష్టకుండా చూసుకోవాలన్నారు.అంతే కాకుండా ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎంత మంది రైతులు పంటలు వేసుకోలేదో వివరాలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు..

# విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సుపై పాఠ్యపుస్తకం



**అనంతపురం సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**

**విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు సాంకేతికత వినియోగంపై రూపొందించిన "విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు అనువర్తనాలు" పాఠ్యపుస్తకాన్ని పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆవిష్కరించారు. డా. జి. శ్రీనివాసన్, డా. బి. హరిప్రసాద్ ఈ పుస్తకాన్ని రచించారు.విద్యుత్ వ్యవస్థల పర్యవేక్షణ, లోపాల గుర్తింపు, విద్యుత్ డిమాండ్ అంచనా, వ్యవస్థల విశ్లేషణ, స్వయంచాలకీకరణ, స్మార్ట్ గ్రిడ్ తదితర ఆధునిక రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా పుస్తకాన్ని రూపొందించినట్లు రచయితలు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. క్రిష్ణ కిషోర్ మాట్లాడుతూ, విద్యార్థులు సంప్రదాయ ఇంజినీరింగ్ పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, స్వయంచాలకీకరణ వంటి ఆధునిక సాంకేతికతలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పుస్తకాలు విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ప్రిన్సిపాల్ డా. బి. రమేష్ బాబు మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలను అందించడమే సంస్థ లక్ష్యమన్నారు. విద్యుత్ ఇంజినీరింగ్‌తో కృత్రిమ మేధస్సును అనుసంధానం చేసే అంశాలపై రూపొందిన ఈ పుస్తకం విద్యార్థులు, అధ్యాపకులకు ఉపయోగకరమైన విద్యా వనరుగా నిలుస్తుందని పేర్కొన్నారు.రచయితలను చైర్మన్ డా. క్రిష్ణ కిషోర్, ప్రిన్సిపాల్ డా. బి. రమేష్ బాబు, యాజమాన్య ప్రతినిధి కె. శ్రీకాంత్ రెడ్డి, ఈఎం అనురాగ్ రెడ్డి, ఏఓ డా. కె. మనోహర్ రెడ్డి అభినందించారు.**

# విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా బోధించాలి: వినయ్

## టీచ్ టూల్ అబ్జర్వేషన్‌లో తరగతి గది బోధనను పరిశీలన

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరంలోని గణేష్ మున్సిపల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం టీచ్ టూల్ అబ్జర్వేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా టీచ్ టూల్ కోఆర్డినేటర్ వినయ్, మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్ పాఠశాలను సందర్శించి తరగతి గదుల్లో జరుగుతున్న బోధనా ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని జిల్లా టీచ్ టూల్ కోఆర్డినేటర్ వినయ్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యం, అవగాహన స్థాయి భిన్నంగా ఉంటుందని, అందుకు అనుగుణంగా బోధనా పద్ధతులను రూపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా, వారిలో ఆసక్తి, ఆలోచనా శక్తి, అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా బోధన సాగించాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యం పెరిగేలా ప్రశ్నలు, చర్చలు, సులభమైన ఉదాహరణలను ఉపయోగించాలని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చోట అదనపు సహకారం అందించాలని సూచించారు.



# వీపీఆర్‌కు దందాలు చేయాల్సిన ఖర్మ పట్టలేదు

**నెల్లూరు సెప్టెంబర్ 10, అనంతజనశక్తి న్యూస్**



వైకాపా నేతలు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌పై శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మండిపడ్డారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై, తనపై చేస్తున్న ఆరోపణలను ఖండించారు. గురువారం తెదేపా నేతలతో కలిసి నెల్లూరులో విలేకర్లతో మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో అనిల్‌కుమార్‌యాదవ్ ఆయన చిన్నాన్న రూప్‌కుమార్ యాదవ్‌ను వెంటబెట్టుకుని వచ్చి 'మీరు శివపార్వతులు, ఎన్నికల్లో ఓడిపోతే రోడ్డున పడతాను.. నా దగ్గర రూపాయి లేదు' అని వేడుకున్న విషయాన్ని మర్చిపోయారా అని గుర్తుచేశారు. వీపీఆర్‌కు దేశవ్యాప్తంగా రూ.50వేల కోట్ల విలువైన మైనింగ్ కాంట్రాక్టులు ఉన్నాయని, ఇంకా 35 ఏళ్లకు సరిపడా వ్యాపారాలు చేతుల్లో ఉన్నాయన్నారు. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన ఆయనకు దందాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. క్వార్ట్జ్ మైనింగ్ పేరుతో అనిల్ ఎవరెవరి దగ్గర ఎంతెంత దోచుకున్నారో తెలిపే 76మంది జాబితా తమవద్ద ఉందన్నారు. మైనారిటీల సంక్షేమానికి మంత్రి నారాయణ రూ.30 కోట్లు ఇస్తే.. వీపీఆర్ రూ.14 కోట్లు ఇచ్చారని, వారి పిల్లల చదువుల కోసం రూ.20 కోట్లతో పాఠశాల నిర్మిస్తున్నామని తెలిపారు. కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తలమంచి, పంచేడు, రాజుపాలెం ప్రాంతాల్లో చేసిన అక్రమ మైనింగ్‌పై ఇంటెలిజెన్స్ నివేదికలు ఉన్నాయని, త్వరలో ఆయన అక్రమాల జాతకం బయటపడుతుందని వెల్లడించారు. ప్రస్తుతం కోవూరులో ఎలాంటి అవినీతికి తావులేదని, కలెక్టర్ సూచనల మేరకే నిబంధనల ప్రకారం పోతిరెడ్డిపాలెంలో ఇసుక అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. వైకాపా నాయకుల అసత్య ప్రచారాలు, కుట్రలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెబుతారని హెచ్చరించారు.

# వైద్యానికి డబ్బు కొరత అడ్డంకి కాకూడదు

**- ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం: మంత్రి సత్యకుమార్ యాదవ్....**
**- సర్వైకల్ మైలోపతి బాధితుడికి రూ.1,21,427 సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ....**

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**

ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వైద్య చికిత్సకు ఎలాంటి ఆటంకం కలగకూడదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు.

ధర్మవరం పట్టణంలోని యాదవ వీధికి చెందిన వల్లంసెట్టి వెంకట్ దీక్షిత్ కొంతకాలంగా సర్వైకల్ మైలోపతి వ్యాధితో బాధపడుతున్నారు. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చును భరించే ఆర్థిక స్థోమత లేక కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కుటుంబ సభ్యులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి తమ పరిస్థితిని వివరించి సహాయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబం పరిస్థితిని తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించారు. వెంకట్ దీక్షిత్‌కు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ ఎస్ వీ ఐ ఎం స్ లో అవసరమైన చికిత్స అందేలా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంరఫ్ ) ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు.

మంత్రి ప్రత్యేక చొరవతో రూ.1,21,427 విలువైన సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్ (లోక్) మంజూరైంది. మంజూరైన ఎల్ఓసీని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా వెంకట్ దీక్షిత్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా వైద్యం పొందాల్సిన సమయంలో ప్రజలకు ప్రభుత్వం అండగా ఉండాలి. ధర్మవరం నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రజల ఆరోగ్య సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత వేగంగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్స కోసం అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సహాయం బాధితులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు, కష్టకాలంలో కుటుంబాలకు భరోసా కల్పించడమే తన లక్ష్యమన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో రూ.1,21,427 సీఎంఆర్ఎఫ్ సహాయం మంజూరు కావడం, ఎల్ఓసీని స్వయంగా అందజేయడంపై వెంకట్ దీక్షిత్ కుటుంబ సభ్యులు



హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే అర్థం చేసుకుని ఎస్ వీ ఐ ఎం స్ లో చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన మంత్రికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు

**- 1.5 కిలోల గంజాయి, రెండు బైకులు, మూడు ఫోన్లు స్వాధీనం**
**- నలుగురు అరెస్ట్.. ఒకరు మైనర్**

**అనంతపురం సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**

నగరంలో పోలీసుల నిఘా పెరగడంతో రూటు మార్చి గంజాయి విక్రయిస్తున్న ముఠాను ఆత్మకూరు పోలీసులు పట్టుకున్నారు. కళ్యాణదుర్గం-అనంతపురం జాతీయ రహదారిలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 1,500 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ ఆదేశాలతో అనంతపురం రూరల్



ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఇటుకలపల్లి సీఐ జె.హేమంత్ కుమార్, ఆత్మకూరు ఎస్ఐ జి.లక్ష్మణరావు సిబ్బందితో కలిసి పక్కా సమాచారంతో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో కర్ణాటకలోని బళ్లారి శ్రీరాంపురం కాలనీకి చెందిన కాకిమాని రాజు (29), అనంతపురంలోని ముసలమ్మ కట్టకు చెందిన నల్లబోతుల సుంకన్న (25), బిందెల కాలనీకి చెందిన ఎడవాల మహేష్ అలియాస్ గుణ (37)తో పాటు చట్టపరిధిలోని ఒక బాలుడు ఉన్నారు. వీరిలో మహేష్ అలియాస్ గుణపై గతంలో రెండు హత్య కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. అనంతపురం నగరంలో తనిఖీలు కఠినతరం కావడంతో నిందితులు ఆత్మకూరు, కళ్యాణదుర్గం గ్రామీణ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తూ సులభంగా డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి వారి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినట్లు వెల్లడించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుకు రూ.కోటి నిధులు

**- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరు**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 10:అనంత జనశక్తి న్యూస్**

**పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుకు తక్షణం రూ.కోటి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రాజెక్టుకు పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి ప్రత్యేకంగా లేఖ ద్వారా తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేసింది. నియోజకవర్గ ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా అందించడంలో సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు ఎంతో కీలకమని ఎమ్మెల్యే సింధూర రెడ్డి తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకువచ్చి మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిధుల మంజూరుపై సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.**



# కంపుకొడుతున్న పాఠశాల మార్గం..



**గాండ్లపెంట, సెప్టెంబర్,9, అనంత జనశక్తి న్యూస్,**

మండల పరిధిలోని రెక్కమాను సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు కోడి వ్యర్థాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పాఠశాలకు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న వంకలో ప్రతిరోజూ కోడి కాళ్లు, కోడి వ్యర్థ పదార్థాలను పడవేస్తుండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వంకలో పెద్దఎత్తున కోడి వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. వ్యర్థాలు కుళ్లిపోవడంతో దుర్వాసన మరింత తీవ్రంగా మారుతోందని విద్యార్థులు, స్థానికులు చెబుతున్నారు. పాఠశాలకు ప్రతిరోజూ వచ్చే విద్యార్థులు ఉదయం, సాయంత్రం ఈ మార్గం గుండా వెళ్లాల్సి ఉండటంతో సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. దుర్వాసన కారణంగా కొంత దూరం వరకు ముక్కులు మూసుకొని నడవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి బోరు వద్దే వ్యర్థాలు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న మరో అంశం ఇదే ప్రాంతంలో తాగునీటి బోరుబావి ఉండటం. పాఠశాల విద్యార్థులు, స్థానికులు వినియోగించే తాగునీటి బోరుకు సమీపంలో కోడి వ్యర్థాలను పడవేయడం వల్ల అపరిశుభ్రత నెలకొంటోందని వారు పేర్కొన్నారు. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన, పరిసరాల్లో పెరిగే ఈగలు, ఇతర కీటకాలతో ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలని విజ్ఞప్తి పాఠశాలకు వెళ్లే మార్గంలో కోడి వ్యర్థాలను పడవేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికే వంకలో పేరుకుపోయిన కోడి కాళ్లు, ఇతర వ్యర్థ పదార్థాలను వెంటనే తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి బోరు పరిసరాలను కూడా శుభ్రం చేసి విద్యార్థులకు, స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించి, భవిష్యత్తులో పాఠశాల మార్గంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థినీ విద్యార్థులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నూతన ఆటో స్టాండ్ ప్రారంభం

**ఆమడగూరు సెప్టెంబర్:10( అనంత జనశక్తి న్యూస్)**

**అమడగూరు స్థానిక మండల కేంద్రంలోని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ కూడలి వద్ద అమడగూరు,వయా బిల్లుర్ ఆటో స్టాండ్ కు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర అనే పేరుతో గురువారం ప్రారంభించారు కర్ణాటక నుండి అమడగూరి,కి అమడగూరు నుండి కర్ణాటకలో బిల్లుర్ కి,వచ్చి పోవుటకు ఆటోలు సమయానికి మంచి సౌకర్యం కల్పిస్తున్నాయని గ్రామస్తులు ప్రయాణికులు కొనియాడారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు దొడ్డం సూరి మహిళా పోలీసు రిజా టీడీపీ సీనియర్ నాయకులు దొడ్డం నరసింహ మూర్తి సుధాకర్ ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సిబ్బంది కాసుల శంకర జరిపిటి రామాంజులు,మున్నా, హరి సులేమాన్ అంజి పి సోము ఈశ్వరప్ప చలపతి శ్రేరాములు మునెస్ తదితర లు పాల్గొన్నారు**



# మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన ర్యాలీ.




**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 10 అనంత జన శక్తి న్యూస్.**

మహిళలు, చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉండాలని, శ్రీ సత్య సాయిజిల్లా వ్యాప్తంగా గురువారం మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా శక్తి టీమ్ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది పాల్గొని మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించారు.విద్యార్థులు, ప్రజలకు మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, సైబర్ భద్రత వంటి అంశాలపై వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించేందుకు 100, 112, 1091, 1098, 181 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. "మహిళలు, చిన్నారుల రక్షణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు.. సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత" అని అవగాహన కల్పించారు.మహిళలు, చిన్నారులపై ఎలాంటి వేధింపులు, హింస, అనుమానాస్పద ఘటనలు జరిగినా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# *పెండింగ్ వేతనాల కోసం డిపిఓ కార్యాలయం ఎదుట ధర్నా

**- సిఐటియు నాయకుడు లక్ష్మీనారాయణ....**

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 10 అనంత జన శక్తి న్యూస్.**



శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు,స్వచ్ఛ భారత్ కార్మికులకు. పెండింగ్ జీతాల కొరకు జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు నాయకుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు , ఎంపీడీవోకి ఈవో ఆర్ డి కి పంచాయతీ సెక్రెటరీ వినతి పత్రాలు అందించి నిరసనలు తెలియజేసిన జీతాలు సమస్య పరిష్కారం కాలేదనీ అందుచేత, పెండింగ్ జీతాల కోసం శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను పంచాయతీ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం. మున్సిపాలిటీలో ఇస్తున్నటువంటి జీతాలను పంచాయతీ కార్మికులకు కూడా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి. కనీస వేతనాలు 21000 అమలు చేయాలి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి గ్రాటిట్యూడ్ సౌకర్యం కల్పించాలి పనిచేస్తూ మరణించిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం మట్టి ఖర్చులు 20000 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 1999లో ఇచ్చిన జీవ ప్రకారం గుర్తింపు కార్డులు పీఎఫ్ పీఎస్ఐ సౌకర్యం కల్పించి పర్మినెంట్ చేయాలని జీవో ఉన్న సత్యసాయి జిల్లాలో అమలు కావడం లేదు ఈ సమస్యల కోసం గ్రామపంచాయతీ వర్కర్లు స్వచ్ఛభారత్ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటి నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి లక్ష్మీనారాయణ,జిల్లా కార్యదర్శి పై పల్లి గంగాధర్ పాల్గొన్నారు.

# శిక్షణార్థి కానిస్టేబుళ్లకు క్రీడోత్సవం ప్రారంభం




**- మూడు రోజుల పాటు వివిధ క్రీడా పోటీలు**

**అనంతపురం సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**

**పోలీస్ శిక్షణలో భాగంగా శిక్షణార్థి కానిస్టేబుళ్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల క్రీడోత్సవం గురువారం అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. పోలీస్ శిక్షణ విభాగం డీఐజీ కె.కె.ఎన్. అన్బురాజన్ ఐపీఎస్ ఉత్తర్వులు, జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.డీటీసీ ప్రిన్సిపాల్, అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి, పోలీస్ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం తెల్ల కపోతాలు, గాలిపటాలు, బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. పచ్చజెండా ఊపి 100, 800 మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగంలో నిరంతరం ఎదురయ్యే శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని, పోలీస్ సేవల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని శిక్షణార్థులకు సూచించారు.మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడోత్సవంలో 100, 200, 400, 800 మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు, 4×100, 4×400 మీటర్ల రిలే, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్‌తో పాటు మానసిక ఏకాగ్రత కోసం యోగా ప్రదర్శనలు కూడా ఉంటాయి.కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ బి.విజయకుమార్, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ రాముడు, పలువురు ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, క్రీడా శిక్షకులు, 101 మంది శిక్షణార్థి కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.**

# వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలి...!



*** సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

*** డీఎంహెచ్ఓ డా. యుగంధర్**

**కడప, సెప్టెంబర్ 10:అనంత జనశక్తి న్యూస్**

ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. యుగంధర్ సూచించారు.గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్ సిబ్బందితో డా. యుగంధర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బందికి సంబంధించిన అన్ని వివరాలను సేవా నమోదు పుస్తకంలో (ఎస్ఆర్) తప్పనిసరిగా ధ్రువీకరించి నమోదు చేయాలని ఆదేశించారు.

తమ పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి సంబంధించిన ప్రతి అంశాన్ని సేవా నమోదు పుస్తకంలో సక్రమంగా పొందుపరచాలని తెలిపారు. వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు పరస్పర సమన్వయంతో పనిచేసి పరిపాలనా సంబంధిత సమస్యలకు తావులేకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.అడ్మినిస్ట్రేటివ్ అధికారి విజయ భాస్కర్ మాట్లాడుతూ.. సేవా నమోదు పుస్తకాలను భౌతికంగా నిర్వహించడంతో పాటు నిధి పోర్టల్‌లో ఎలక్ట్రానిక్ సేవా నమోదు పుస్తకాలను ఈ నెల 30వ తేదీలోగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వైద్య సిబ్బందికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఎస్ఆర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సమాచారాన్ని ఈఆఫీస్ ద్వారానే పంపించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. ప్రవీణ్ మాట్లాడుతూ.. హెచ్‌పీవీ టీకాతో పాటు ఇతర వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత సమయంలో వేయించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.అనంతరం సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించిన పోస్టర్లను డీఎంహెచ్ఓ డా. యుగంధర్ ఆవిష్కరించారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో డీఎల్ఏటీఓ డా. రవి బాబు, డీఐఓ డా. ప్రవీణ్, పీఓ ఎన్‌సీడీ/ఆర్‌బీఎస్‌కే డా. ఆరిఫుల్లా, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**- భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆస్ట్రియా నిపుణుల సూచన**

**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 10 (అనంత జనశక్తి న్యూస్):**

పుట్టపర్తి పరిధిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐఎస్ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్ట్రియాకు చెందిన సైబర్ భద్రతా నిపుణులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ, విద్యా, పారిశ్రామిక డిజిటల్ వ్యవస్థలను సైబర్ దాడుల నుంచి రక్షించుకోవడం ఎంతో ముఖ్యమని నిపుణులు తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు, డిజిటల్ భద్రతకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.సైబర్ భద్రత రంగంలో ఉద్యోగ అవకాశాలతో పాటు అంతర్జాతీయ శిక్షణ, ఉన్నత విద్య, పరిశోధన, నూతన వ్యాపార అవకాశాలు విస్తారంగా ఉన్నాయని వివరించారు. విద్యార్థులు నిపుణులతో నేరుగా చర్చించి సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై అవగాహన పొందారు. కార్యక్రమం అనంతరం ఆస్ట్రియా నుంచి వచ్చిన సైబర్ భద్రతా నిపుణులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# లాలూ కుటుంబానికి బిగ్ షాక్

**– ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ**
**– ఐఆర్‌సీటీ స్కామ్ వ్యవహారం**
**– నిందితులపై అనుమానం ఉందన్న ఢిల్లీ కోర్టు**

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. ఐఆర్‌సీటీకీ హోటళ్ల కాంట్రాక్టుల వ్యవహారానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆర్జేడీ అధినేత, మాజీ మంత్రి లాలూ, ఆయన భార్య రబ్రీ దేవీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌లతో సహా 9 మందిపై అభియోగాలు నమోదు చేసేందుకు ఢిల్లీలోని రౌస్‌ఎవెన్యూ కోర్టు ఆదేశించింది. ఈ కేసులో నిందితులపై మనీలాండరింగ్‌కు సంబంధించిన బలమైన అనుమానాలు ఉన్నట్లు న్యాయమూర్తి విశాల్ గోగ్నే పేర్కొన్నారు. రాజకీయ కక్ష సాధింపు కోసమే ఈ కేసు పెట్టారనే నిందితుల వాదనల్ని కోర్టు కొట్టిపారేసింది. తాజా ఉత్తర్వుల్లో ఏడుగురు నిందితుల్ని కోర్టు కేసు నుంచి డిశ్చార్జ్ చేసింది.

**కేసు ఏంటి.?**

20042009 మధ్య లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సీటీసీ కాంట్రాక్టులకు సంబంధించి స్కామ్ జరిగింది. రాంచీ, పూరీలోని రైల్వే బీఎన్ఆర్ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా సుజాతా హోటల్స్‌కు కట్టబెట్టారని సీబీఐ ఆరోపించింది. దీనికి ప్రతిఫలంగా పాట్నాలోని విలువైన భూముల్ని లాలూ కుటుంబానికి అనుబంధంగా ఉన్న సంస్థలకు తక్కువ ధరకు బదిలీ చేశారని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ వ్యవహారంలో కాంట్రాక్టులకు ప్రతిఫలంగా ''క్విక్ ప్రోకో''గా సీబీఐ ఆరోపించింది. సీబీఐ కేసు ఆధారంగా ఈడీ ఈ స్కామ్‌పై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ మొత్తం స్కామ్ ద్వారా వచ్చిన పాట్నా భూములపై రబ్రీ దేవీ, తేజస్వీ యాదవ్ నియంత్రణ సాధించారు. తాజాగా కోర్టు ఆదేశాలతో ఈడీ మనీలాండరింగ్ కేసు ఇప్పుడు ట్రయల్ దశలోకి వచ్చింది. అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులు అక్టోబర్ 03 కోర్టు ముందు హాజరుకావాల్సి ఉంది.



# చేనేత పెన్షన్లపై ప్రత్యేక దృష్టి

**- హ్యాండ్లూమ్ కార్యాలయాన్ని సందర్శించి....**
**- సర్టిఫికెట్ల జారీపై అధికారులతో సమీక్ష.....**
**- అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి పెన్షన్ అందేలా చర్యలు చేపట్టాలి – హరీష్ బాబు.....**

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచన మేరకు ఆయన నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు గురువారం ధర్మవరం మార్కెట్ యార్డులోని హ్యాండ్లూమ్ కార్యాలయాన్ని సందర్శించారు. నూతనంగా దరఖాస్తు చేసుకునే చేనేత పెన్షన్లకు అవసరమైన హ్యాండ్లూమ్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా చేనేత తదితర వృత్తి ఆధారిత పెన్షన్ల దరఖాస్తులకు అవకాశం కల్పించిందన్నారు. చేనేత పెన్షన్‌కు హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ సర్టిఫికెట్ అవసరమైనందున, సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వచ్చే కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. మగ్గం కలిగి, ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి పెన్షన్ అందేలా అధికారులు చొరవ చూపాలని ఆయన అన్నారు. సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను త్వరగా పరిశీలించి, అవసరమైన వెరిఫికేషన్ పూర్తి చేసి సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు. అలాగే హ్యాండ్లూమ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అక్నాలెడ్జ్మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులను కోరారు. దీనివల్ల తమ దరఖాస్తు స్వీకరించబడిందా, ఏ దశలో ఉందనే విషయాన్ని దరఖాస్తుదారులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని హరీష్ బాబు తెలిపారు. అర్హత కలిగిన ఒక్క చేనేత కుటుంబం కూడా పెన్షన్ వంటి సంక్షేమ పథకాలకు దూరం కాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సర్టిఫికెట్ జారీ నుంచి పెన్షన్ మంజూరు వరకు ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

# మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి

**- గుర్తింపు కార్డు మంజూరు చేయాలి....**
**- ఎన్టీఆర్ భరోసా చేనేత పెన్షన్‌కు మగ్గమే ప్రామాణిక అర్హతగా తీసుకోవాలి....**
**- హ్యాండ్లూమ్ ఏ.డీ.కి టీడీపీ నాయకుల వినతి.....**

**ధర్మవరం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ఎటువంటి షరతులు లేకుండా చేనేత గుర్తింపు కార్డు మంజూరు చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా చేనేత పెన్షన్ కోసం అర్హులైన ప్రతి కార్మికుడిని గుర్తించి, వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చేనేత కార్మికులతో కలిసి పట్టణ టీడీపీ నాయకులు మార్కెట్ యార్డులోని హ్యాండ్లూమ్ కార్యాలయాన్ని సందర్శించి, హ్యాండ్లూమ్ ఏ.డీ. అప్పాజీతో చర్చించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. చేనేత కార్మికుడికి మగ్గం ఉండటమే ప్రధాన ప్రామాణికంగా తీసుకోవాలని, ఇతర అనవసర నిబంధనల కారణంగా అర్హులైన కార్మికులు పెన్షన్‌కు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్టీఆర్ భరోసా చేనేత పెన్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మరో ఆరు రోజులు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ధర్మవరం పట్టణంలోని 40 వార్డుల్లో త్వరితగతిన సర్వే నిర్వహించి, మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడిని గుర్తించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి చేనేత గుర్తింపు కార్డు మంజూరు చేసి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో నమోదు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని హ్యాండ్లూమ్ అధికారులను టీడీపీ నాయకులు కోరారు. దీనిపై హ్యాండ్లూమ్ ఏ.డీ. అప్పాజీ స్పందిస్తూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల మేరకు అర్హులైన చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ నాయకులకు తెలిపారు. అర్హుడైన ఒక్క చేనేత కార్మికుడు కూడా పెన్షన్ కు దూరం కాకుండా చూడటమే తమ లక్ష్యమని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు.

# వీధి వ్యాపారులకు మంత్రి నారాయణ ఆపన్నహస్తం

**- 92 మందికి తోపుడు బండ్లు, 12 మంది వికలాంగులకు ట్రైసైకిళ్లు,**
**- 40 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి కుమార్తె పొంగూరు షరణి .**
**- మంత్రి కుటుంబ సేవాదృక్పథానికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు.**

**నెల్లూరు సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్**



పేదరికం కష్టాలను స్వయంగా అనుభవించిన తన తండ్రి మంత్రి నారాయణ పేదల పక్షాన నిలిచే నాయకుడిగా ముందుకు సాగుతున్నారని ఆయన కుమార్తె పొంగూరు షరణి అన్నారు. సిటీ నియోజకవర్గంలోని వీధి వ్యాపారులు, వికలాంగులు, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు అండగా నిలుస్తూ తమ కుటుంబం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు.గోమతి నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 92 మంది పేద వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, 12 మంది వికలాంగులకు ట్రైసైకిళ్లు, 40 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పొంగూరు షరణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి నారాయణ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా షరణి మాట్లాడుతూ తన తండ్రి నారాయణ నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగారని, పేదల కష్టాలను స్వయంగా అనుభవించారని చెప్పారు. ఎన్నికల ప్రచార సమయంలో వీధి వ్యాపారుల సమస్యలను దగ్గరగా చూశారని, తోపుడు బండ్లకు అద్దె చెల్లించలేక వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించారని తెలిపారు.అధికారంలోకి వచ్చిన వెంటనే పేద వీధి వ్యాపారులకు ఉచితంగా తోపుడు బండ్లు అందిస్తానని నాన్న మాట ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ విడతల వారీగా ఇప్పటివరకు 865 తోపుడు బండ్లను పంపిణీ చేశామని తెలిపారు. వికలాంగులకు ఇప్పటివరకు 25 ట్రైసైకిళ్లను అందించామని, పేదల వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 529 మందికి రూ.4.88 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం అందించామని వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట సంజీవనిలా పనిచేస్తోందని షరణి అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు సహాయం కోరినప్పుడు మానవతా దృక్పథంతో సీఎంఆర్ఎఫ్ మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

**పేద పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి**

పేద పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా యువనేత నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా విద్యారంగంలో కూడా తన తండ్రి నారాయణ ప్రత్యేక దృష్టి పెట్టారని షరణి తెలిపారు.నెల్లూరులోని వీఆర్సీ స్కూల్ తరహాలో మరో 15 ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నారని చెప్పారు.నిరుపేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలన్నదే నాన్న లక్ష్యమన్నారు . పేద విద్యార్థుల కోసం ఒలింపియాడ్, ఐఐటీ ఫౌండేషన్ కోర్సులను కూడా ప్రారంభించారని తెలిపారు. ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్, డిఎస్ఆర్ పాఠశాలలను ఈ నెల 16న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నారని తెలిపారు. తన తండ్రి చేపట్టిన విద్యాయజ్ఞంలో తాను కూడా భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నెల్లూరు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని చెప్పారు.నమ్మిన ప్రతి ఒక్కరికీ తమ కుటుంబం అండగా నిలుస్తుందన్నారు. నాన్నగారికి అండగా నిలిచి అత్యధిక మెజారిటీ ఇచ్చిన సిటీ ప్రజల రుణాన్ని సేవా కార్యక్రమాల ద్వారా తీర్చుకుంటామని షరణి అన్నారు.

**అభివృద్ధి,సంక్షేమం సమపాళ్లలో**

డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు సిటీలో మంత్రి నారాయణ అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. రాజకీయ నాయకుడంటే ఎలా ఉండాలో చూపించేలా రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారని కొనియాడారు.పేదల పక్షపాతిగా ఆయన మన్ననలు పొందుతున్నారని, సొంత నిధులతో పాటు స్నేహితుల సహకారాన్ని కూడా సమీకరించి నగర రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో అపార అనుభవమున్న కుమార్తె షరణిని కూడా ఈ విద్యాయజ్ఞంలో భాగస్వామిని చేయడం అభినందనీయమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణం స్పందించే కుటుంబంగా మంత్రి నారాయణ కుటుంబం నిలుస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, కరీముల్లా, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలు, క్రమబద్ధీకరణ జాబితాను సిద్ధం చేయండి

**- 10 రోజుల్లో సమగ్ర ప్రణాళికతో రండి : కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, సెప్టెంబర్ 10 :అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై పరిమిత సమయం పెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి 10 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై చర్చించారు. ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వచ్చే నెల 15వ తేదీ నాటికి వాటి పరిశీలన పూర్తి చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశిం చారు. ఎంతమం దికి కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.. ఎంతమందికి పట్టాలను క్రమబద్ధీక రించాలనే అంశాలపై స్పష్టమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాల పురోగతి పైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇళ్ల పట్టా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్హుల గుర్తింపు నుంచి పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాల పూర్తి వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

# రాష్ట్ర ఆర్థిక వృద్ధికి జిల్లాలే చోదక శక్తులు






- అవకాశాలను అన్ లాక్ చేస్తేనే జీఎస్డీపీ లక్ష్యం సాధ్యం
- పెట్టుబడుల్ని ఆకర్షించేలా అక్టోబరులో ప్రాంతీయ సదస్సులు
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2026–27 వృద్ధిరేటు అంచనా 13.44 శాతంగా నమోదైందన్న అధికారులు

**అమరావతి, సెప్టెంబర్ 10 అనంత జనశక్తి ప్రతినిధి**

జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకునేలా జిల్లాల్లో ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయాలని, స్థానిక వనరులను సమర్థంగా మార్కెటింగ్ చేసుకుని సంపద సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల వారీగా వృద్ధి సమాచారాన్ని మంత్రులు, కలెక్టర్లకు అందించేలా ఆర్టీజీఎస్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెట్టుబడుల గ్రౌండింగ్, జీఎస్డీపీ సహా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ధరల సూచీ సహా వివిధ అంశాలను పరిగణించేందుకు 202223ను బేస్ ఇయర్ గా కేంద్రం నిర్ధారించిందని అధికారులు తెలిపారు. ప్రస్తుత ధరల మేరకు 2026-27 వృద్ధిరేటు అంచనా 13.44 శాతంగా నమోదైందని వెల్లడించారు. వ్యవసాయ అనుబంధ రంగాల జీవీఏ వృద్ధిరేటు 2026-27 తొలి త్రైమాసికంలో 14.19 శాతానికి పెరిగిందని, పరిశ్రమల రంగంలో 14.81 శాతం, సేవల రంగంలో 12.70 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. ఆక్వా రంగంలో 6.61 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో 31.77 శాతం వృద్ధి నమోదైందన్నారు.

**14.28 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం**

విద్యుత్ ఉత్పత్తి 24,248 మిలియన్ యూనిట్ల నుంచి 28,664 మిలియన్ యూనిట్లకు పెరిగిందని, విద్యుత్ వినియోగం 14.28 శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. ఇక పారిశ్రామిక ఉత్పత్తిలో తొలి త్రైమాసికంలో రూ.1,13,638 కోట్ల జీవీఏ నమోదైందని, సేవల రంగంలో 2026-27 తొలి త్రైమాసికానికి రూ.1,60,107 కోట్ల జీవీఏ నమోదైందని వివరించారు. జీఎస్టీ ఆదాయంలోనూ 18 శాతం మేర పెరుగుదల నమోదైందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టాస్క్‌ఫోర్స్ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన 20 రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని, రూ.13.85 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు, 10.6 లక్షల ఉద్యోగాలు వచ్చేలా ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో ఇప్పటికే 160 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, రూ.4.03 లక్షల కోట్ల పెట్టుబడులతో 5.9 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐపీబీలో అనుమతులు పొందిన ప్రాజెక్టులను వేగంగా గ్రౌండ్ చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను కూడా ఖరారు చేయాలని, ప్రాజెక్టులు గ్రౌండ్ కావడంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆదేశించారు.

**ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో ప్రస్తుతం తయారీ, సేవలు, వాణిజ్య రంగాల్లో 23.85 లక్షల ఎంఎస్ఎంఈలు ఉన్నాయని అధికారులు తెలిపారు. 175 ఎంఎస్ఎంఈ పార్కులకు గాను ఇప్పటికే 138 పార్కులకు ఆమోదం లభించిందని, 22 పార్కులు ప్రారంభమయ్యాయని, మిగతా 116 పార్కులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా రూ.2,036 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండగా, 31,163 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖ, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అక్టోబరులో ప్రాంతీయ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా నవంబరులో 2026 భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న హెలిప్యాడ్‌లను నోటిఫై చేయాలని

ముఖ్యమంత్రి ఆదేశించారు. వీటిని పర్యాటక రంగంతోనూ అనుసంధానించే అవకాశం ఉంటుందని సూచించారు. జిల్లా కేంద్రాల్లో నైట్ ల్యాండింగ్ ఫెసిలిటీలను ప్రారంభించేలా కేంద్రం నుంచి అనుమతులు పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల్లో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల పురోగతిని సమన్వయం చేస్తూ లక్ష్యాలను వేగంగా సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# జిల్లాల ప్రగతితోనే వృద్ధి పరుగు సాధ్యం

- జిల్లా కలెక్టర్లు దీనిపై దృష్టి సారించాలి
- ప్రతి జిల్లాకు ప్రత్యేక అవకాశాలుంటాయి
- వాటిని గుర్తించి ఆ దిశగా జిల్లాను ఆదాయ మార్గాలు పెంచాలి
- వృద్ధిరేటుపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్

**అమరావతి సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్**

జిల్లాల ప్రగతి చిత్రమే రాష్ట్ర వృద్ధి పరుగుకు ఊతమిస్తుందని, జిల్లా కలెక్టర్లు ప్రతి నెలా స్థూల విలువ జోడింపులో తాము ఏ దశలో ఉన్నామో తెలుసుకుని ముందుకు వెళ్లడానికి కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ సూచించారు. సచివాలయంలో జరుగుతున్న 8వ కలెక్టర్ల సదస్సులో ఆయన రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై పవర్ పాయింటు ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాల అభివృద్ధికి విజన్ ఫ్రేమ్ వర్క్ రూపొందించి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఆర్థికాభివృద్ధిలో ఆయా జిల్లాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది తెలుసుకోవడానికి ఎప్పటికప్పుడు మదింపు వేస్తున్నామన్నారు. మండల స్థాయిలో కూడా ఆర్థిక ప్రగతిని మదింపు వేస్తున్నామని, ఆయా జిల్లాలు స్థూల విలువ జోడింపు (జీఏవీ)లో ఏ ర్యాంకులో ఉన్నామనేది తెలుసుకుని, ఎక్కడెక్కడ వెనకబడ్డామో ఆయా రంగాల్లో ప్రగతి సాధించడానికి కృషి చేసేలా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు. మనం పనిచేస్తున్నాం కానీ ఎంతమాత్రం ఫలితాలు సాధిస్తున్నామనేది ముఖ్యంగా పరిశీలించాలన్నారు. ఒక జిల్లాను మరో జిల్లాతో పోల్చలేమని, ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అవకాశాలుంటాయని, ఆయా రంగాల్లో ఆదాయార్జన పాటుపడాలన్నారు. జిల్లాలో జరిగే వస్తు, వ్యవసాయోత్పత్తులకు మార్కెట్లో మంచి ధర లభించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏ మండలం బలం ఏంటీ, దానికున్న ప్రధాన ఆర్థిక బలాలేంటీ, ఆ మండలం ఎందుకు వెనుకబడింది అనేది సమీక్షించుకుని ఆయా మండలాల్లు ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాగా రాణించిన జిల్లాలను ఆదర్శంగా తీసుకుని వెనుకబడిన జిల్లాలు ముందుకు వెళ్లాలన్నారు. డేటా ఆధారంగా తమ జిల్లాకు దశను, దిశను కలెక్టర్లు నిర్దేశించుకోవాలని సూచించారు.

# వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి






- మండపాలకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీఐ హేమంత్‌కుమార్

**అనంతపురం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ సీఐ జె.హేమంత్‌కుమార్ సూచించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులతో పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించారు.వినాయక మండపాలు, స్వాగత తోరణాల ఏర్పాటుతో రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని తెలిపారు. విద్యుత్ వైరింగ్, లైటింగ్ ఏర్పాట్లను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిపుణుల సహాయంతో చేపట్టాలని, అక్రమ విద్యుత్ కనెక్షన్లు వినియోగించరాదని స్పష్టం చేశారు.డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, లౌడ్‌స్పీకర్లు, ఇతర ధ్వని పరికరాలను ప్రభుత్వ నిబంధనలు, పోలీసుల సూచనలకు లోబడి మాత్రమే వినియోగించాలని తెలిపారు. రాత్రి వేళల్లో ధ్వని పరికరాల వినియోగంపై అమల్లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసే నినాదాలు, ప్రసంగాలు, పాటలు, బ్యానర్లు ప్రదర్శించరాదని సూచించారు.ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసులు సూచించిన మార్గం, సమయాన్ని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈత రాని వారు, చిన్నారులు నీటిలోకి దిగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఊరేగింపుల్లో కత్తులు, కర్రలు, ఆయుధాలు, మండే పదార్థాలు వంటి ప్రమాదకర వస్తువులను తీసుకెళ్లరాదని హెచ్చరించారు. బాణసంచా కాల్చడం, ప్రమాదకర విన్యాసాలు చేయడం, వాహనాలపై నిలబడి ప్రయాణించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు, తప్పుడు వార్తలను నమ్మవద్దని, రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలను ఇతరులకు పంపవద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వినాయక చవితి, నిమజ్జన వేడుకల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. “పండుగను ఆనందంగా జరుపుకుందాం..నిబంధనలు పాటిద్దాం..శాంతిభద్రతలకు సహకరిద్దాం” అని పోలీసులు పిలుపునిచ్చారు.

# గుత్తి కోటకు అరుదైన గౌరవం

- స్మారక తపాలా బిళ్లకు కీలక ముందడుగు
- అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృషికి మరో గుర్తింపు

**అనంతపురం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లాకు చెందిన చారిత్రక వారసత్వ సంపద గుత్తి కోటకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకువచ్చే దిశగా కీలక ముందడుగు పడింది. గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేసిన ప్రతిపాదన కేంద్ర తపాలా శాఖలో కీలక దశకు చేరుకుంది. గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని ఎంపీ అంబికా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, తపాలా శాఖ పరిశీలన జరిపి, స్మారక తపాలా బిళ్ల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి ఆమోదం కోసం సమర్పించింది. తపాలా శాఖ అధికారిక నోట్‌లో గుత్తి కోట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అతిపెద్ద కోటల్లో ఒకటిగా, 1921 నుంచి భారత పురావస్తు సర్వే శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర రక్షిత స్మారక చిహ్నంగా ఉన్నట్లు పేర్కొంది. చాళుక్యులు, విజయనగర సామ్రాజ్యం, మొఘలులు, మరాఠాలు, బ్రిటిష్ పాలన వంటి అనేక చారిత్రక దశలకు గుత్తి కోట సాక్ష్యంగా నిలిచిందని గుర్తించింది. గుత్తి కోటలోని బహుళస్థాయి ప్రాకారాలు, బురుజులు, పురాతన మార్గాలు, నీటి నిల్వలు, చారిత్రక రఘునాథస్వామి ఆలయం వంటి నిర్మాణాలు దాని అపారమైన చారిత్రక, నిర్మాణ, సాంస్కృతిక ప్రాధాన్యతను ప్రతిబింబిస్తున్నాయని తపాలా శాఖ పేర్కొంది. గుత్తి కోటపై ఇప్పటివరకు స్మారక తపాలా బిళ్ల విడుదల కాలేదని కూడా తపాలా శాఖ అధికారికంగా నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రతిపాదనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.

**లక్ష బిళ్లల తప్పనిసరి కొనుగోలు నిబంధనకు మినహాయింపు**

స్మారక తపాలా బిళ్లల విడుదలకు సాధారణంగా అమల్లో ఉన్న ఒక.లక్ష బిళ్లల తప్పనిసరి కొనుగోలు నిబంధన నుంచి గుత్తి కోట ప్రతిపాదనకు మినహాయింపు ఇవ్వాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్రాన్ని కోరారు. ఈ మినహాయింపుతో కూడిన ప్రతిపాదనను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి ఆమోదం కోసం తపాలా శాఖ ఫైల్‌లో సమర్పించింది. గుత్తి కోటకు స్మారక తపాలా బిళ్ల విడుదలైతే అనంతపురం జిల్లా చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించడంతో పాటు, గుత్తి కోటను ప్రముఖ వారసత్వ, సాంస్కృతిక, విద్యా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది.

**ఎంపీ అంబికా ఏమంటున్నారంటే..**

అనంతపురం జిల్లాకు ఉన్న గొప్ప చారిత్రక వారసత్వాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదలకు ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే గుత్తి కోట చరిత్రకు, అనంతపురం జిల్లా ప్రజలకు ఇది ఒక ప్రత్యేక గౌరవంగా నిలుస్తుంది” అని పేర్కొన్నారు.



# రాష్ట్ర మంతటా డిజిటల్ కనెక్టివిటీ

- టెలికాం కనెక్టివిటీ లేని ప్రాంతం కనిపించకూడదు
- టవర్ల నిర్మాణానికి స్థల సమస్య అడ్డు కారాదు
- జిల్లా కలెక్టర్లు ఈ దిశగా సహకరించాలి
- ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేనీ

**అమరావతి సెప్టెంబర్ 10 అనంత జనశక్తి ప్రతినిధి**

రాష్ట్రమంతటా డిజిటల్ కనెక్టివీ కల్పించాలన్నదే ప్రభుత్వ ఆశయమని, రాష్ట్రంలో ఏ ప్రాంతం కూడా టెలికాం కనెక్టివిటీ లేదనే మాట ఉత్పన్నం కాకుండా ఉండాలన్నదిశగా ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని తెలిపారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఆయన డిజిటల్ కనెక్టివిటీ స్థితిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకం కింద రాష్ట్రానికి మొత్తం 1023 టవర్లు మంజూరయ్యాయని, ఇదులో 143 టవర్ల ఏర్పాటు చేయడం జరిగిందని, 428 టవర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. 11 టవర్లకు అటవీ భూమి సమస్యగా ఉందని చెప్తున్నారని, జిల్లా కలెక్టర్లు అటవీ భూమి చూపితే చాలని, దీనికోసం నిధులు కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ సమస్య పరిష్కరిస్తే టవర్ల నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు కూడా కనెక్టివిటీ ఇవ్వడానికి అవకాశముంటుందని చెప్పారు. దీంతో పాటు వందశాతం కనెక్టివిటీ కింద రాష్ట్ర ప్రభుత్వం మరో పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్సులోపు టవర్ల నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామని, కలెక్టర్లు దీనికి సహకారం అందివ్వాలని చెప్పారు.

# వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్‌ను వేగవంతం చేయాలి



- అక్టోబర్ నాటికి డీపీఆర్, ఫ్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్, ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేయాలి
- భూసేకరణను నాలుగు నెలల్లో పూర్తి చేయాలి
- -జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి సెప్టెంబర్ 10 అనంత జనశక్తి న్యూస్**

పల్నాడు జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.అమరావతి సచివాలయంలో వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్ ప్రాజెక్టుపై పల్నాడు జిల్లా ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్టు సీఈ, ఎస్ఈ, ఏజెన్సీల ప్రతినిధులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, సర్వే, భూసేకరణ అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. ప్రాజెక్టు పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పల్నాడు జిల్లాలో సుమారు 84 వేల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందించడమే వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. మెట్ట ప్రాంత రైతుల చిరకాల సాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.కూటమి ప్రభుత్వం వరికపుడిశిల ప్రాజెక్టును 36 ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో చేర్చిందని మంత్రి నిమ్మల తెలిపారు. ప్రాజెక్టును కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, అవసరమైన అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.అక్టోబర్ నాటికి వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్ డీపీఆర్, ఫ్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్, ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి స్పష్టమైన గడువు విధించారు.అదేవిధంగా ప్రాజెక్టుకు అవసరమైన 586 ఎకరాల భూమిని రూ.63 కోట్ల వ్యయంతో భూసేకరణ చేసి, నాలుగు నెలల్లో ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, డీపీఆర్, భూసేకరణ తదితర పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. పల్నాడు మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును నిర్దేశిత కాలపరిమితిలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు దాతల చేయూత



**అనంతపురం సెప్టెంబర్ 10, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గల అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ అందిస్తున్న స్వచ్ఛమైన సేవలను గుర్తించి దాతలు చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు. ఏడాది కిందట ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలత ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ అనతికాలంలోనే రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. తల్లి పాలకు నోచుకొని శిశువులకు తల్లుల నుంచి సేకరించిన పాలు అందిస్తూ వారి ఆకలి తీరుస్తున్నారు. శిశువులకు మిల్క్ బ్యాంక్ ఉద్యోగులు అందిస్తున్న నిస్వార్థ సేవలకు దాతలు పలువురు ముగ్ధులై తమ వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా దాతలు స్నేహలత హాస్పిటల్ డాక్టర్ బి.అరుణ, మీనాక్షమ్మ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటరమణ, ఆలంబన జనార్దన్, ఆలంబన లలిత అనే దాతలు ముందుకొచ్చి తమవంతుగా అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు అవసరమైన 20 డిగ్రీ డీ ఫ్రీజర్, మిల్క్ ట్రాన్స్పోర్ట్ క్యారియర్స్ ను వితరణగా అందించారు. అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలో ఇలాంటి మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేయడం, ఎంతోమంది తల్లుల నుంచి పలు సేకరించి, వాటిని భద్రపరిచి, తల్లిపాలు లేని శిశువులకు అందించడం గొప్ప కార్యంగా దాతలు పేర్కొన్నారు. మిల్క్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేసిన ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత, పీడియాట్రిక్, మిల్క్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ హరిణి, స్టాఫ్ నర్సులు బళ్లారి బోయ సుకన్య, సునీత, మానస, రమ, హైమా, సిబ్బంది వేంకటసాయి, వెంకటరమణను అభినందించారు. అనంతరం దాతలను, హెచ్.డీ.ఎస్ సభ్యులు ఓలేటి రత్నమయ్య, నరసింహులుకును మిల్క్ బ్యాంక్ ఉద్యోగులు శాలువాలు కప్పి సత్కరించారు.

# విశాఖలో ఘనంగా ప్రారంభమైన
# 41వ ఐఏటీవో వార్షిక సదస్సు



- దేశానికే ప్రధాన పర్యాటక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవిస్తోంది:పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ఏపీని విజిట్ చేయండి.. భారతదేశ వైవిధ్యాన్ని అనుభూతి చెందండి: టూర్ ఆపరేటర్లకు మంత్రి దుర్గేష్ పిలుపు
- గోదావరి పుష్కరాల కోసం 7 ప్రత్యేక పర్యాటక సర్క్యూట్ల రూపకల్పన.. కుంభమేళా రేంజ్‌లో పుష్కరాల ఘనతను ప్రపంచానికి చాటేందుకు ప్రణాళికలు: మంత్రి కందుల దుర్గేష్
- పాలసీ నుంచి ప్రమోషన్ వరకు... ఏపీ టూరిజంలో ఆరంచెల విధానం.. ప్రసాద్, స్వదేశీ దర్శన్, శాస్కి, సీబీడీడీ పథకాలతో ఏపీలో పర్యాటక ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయన్న మంత్రి కందుల దుర్గేష్
- టూర్ ఆపరేటర్లే పర్యాటక రంగానికి అసలైన పిల్లర్లుగా అభివర్ణించిన మంత్రి దుర్గేష్
- సరైన సమయంలో సరైన శాఖ సరైన వ్యక్తి చేతిలో పెట్టారంటూ మంత్రి కందుల దుర్గేష్ ను కొనియాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**విశాఖపట్నం సెప్టెంబర్ 10 అనంత జనశక్తి ప్రతినిధి**

భారతదేశ పర్యాటక చిత్రపటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అత్యంత కీలకమైన, ప్రధానమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.భారతదేశంలో ఇన్ బౌండ్ టూరిజం వృద్ధిని మరింత వేగవంతం చేయడమే ప్రధాన లక్ష్యంగా, "ఇండియా ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్ తో గురువారం సాయంత్రం విశాఖపట్నంలోని 'నోవాటెల్' హోటల్ వేదికగా 41వ 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్' (IATO) వార్షిక సదస్సు అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సదస్సు ప్రారంభ సూచికగా 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ మాన్యువల్ బుక్'ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం కుంభమేళా తరహాలో ఆధ్యాత్మికత, సంస్కృతి, వారసత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఏపీ పర్యాటక శాఖ రూపొందించిన ప్రతిష్ఠాత్మక 'ది గోదావరి కాల్స్' పోస్టర్‌ను మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. అందులో 2027లో జరగబోయే గోదావరి పుష్కరాల విశిష్టతను, పర్యాటక సర్క్యూట్ ల వివరాలున్నాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ..ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. పర్యాటకులు కేవలం ఒక రాష్ట్రాన్ని సందర్శించడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠాత్మక పర్యాటక అనుభవాల ద్వారా భారతదేశ సమగ్ర సంస్కృతిని అనుభూతి చెందుతారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దేశ విదేశాల నుంచి విచ్చేసిన పర్యాటక ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సందర్శించి, ఇక్కడి సంస్కృతి, ఆతిథ్యంతో మమేకమవ్వాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలోని పర్యాటక అవకాశాలను స్వయంగా తెలుసుకొని, ఏపీ పర్యాటకాన్ని ప్రపంచ వేదికపై ప్రచారం చేయడానికి భాగస్వాములు కావాలని కోరారు.ఈ సందర్భంగా 2, 3, 4, మరియు 7 రోజుల ప్రత్యేక ఏపీ పర్యాటక ప్యాకేజీలను రూపొందించాలని కోరారు. ప్రసంగంలో తన భాషాభిమానాన్ని చాటుకుంటూ "దేశభాషలందు తెలుగు లెస్స" అని స్మరించుకున్న మంత్రి దుర్గేష్ ఏపీ పర్యాటక ప్రతినిధులకు ఐఏటీఓ నమోదులో ఉచిత రిజిస్ట్రేషన్ కల్పించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిందని, నూతన పర్యాటక పాలసీ (202429) ద్వారా పెట్టుబడిదారులకు భారీ రాయితీలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. అంతేగాక క్యారవాన్, హోమ్ స్టే, ల్యాండ్ అలాట్ మెంట్, ఎంప్లాయిమెంట్ జనరేషన్ తదితర అనుబంధ పాలసీలతో గడిచిన రెండేళ్లలోనే రాష్ట్రానికి రూ. 20,000 కోట్ల పర్యాటక పెట్టుబడులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. పర్యాటకాభివృద్ధిని పాలసీ, ప్రాసెస్, పార్ట్‌నర్‌షిప్, ప్రాజెక్ట్స్, ప్రమోషన్, ప్రొడక్ట్స్ అనే ఆరు ప్రాథమిక సూత్రాల ఆధారంగా పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 201924 మధ్య పర్యాటక రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెల్‌నెస్, ఎకో, అడ్వెంచర్, హెలీ, సీప్లేన్ టూరిజం వంటి వినూత్న పద్ధతులను వేగవంతం చేశామని తెలిపారు. 1058 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ సముద్రతీరంలో యోగా, ఆయుర్వేద ఆధారిత 'వెల్‌నెస్ టూరిజం'ను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. అరకు, లంబసింగి, మారేడుమిల్లి వంటి అందమైన పర్యాటక ప్రాంతాల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టి కలిగిన నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటకరంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, స్థానిక ఉపాధి కల్పనకు ప్రధాన 'గ్రోత్ ఇంజిన్'గా మారుస్తున్నామని స్పష్టం చేశారు.
కేంద్ర ప్రభుత్వ ప్రసాద్, శాస్కి, సీబీడీడీ , స్వదేశీ దర్శన్ పథకాల సహకారంతో రాష్ట్రంలో పర్యాటక ప్రదేశాలను ఆధునీకరిస్తూ మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాలు పర్యాటక రంగానికి గొప్ప ఊతాన్నిచ్చాయని వెల్లడించారు.

**గోదావరి తీరంలో 7 ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లు:**
గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందించేలా ఏపీ పర్యాటక శాఖ గోదావరి పరివాహక ప్రాంతాల్లో 7 పర్యాటక సర్క్యూట్లను రూపొందించిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. అందులో పంచారామ క్షేత్రాలు, శక్తిపీఠాలు, దేవీ క్షేత్రాలు, వైష్ణవ దివ్య క్షేత్రాలు, గోదావరి హెరిటేజ్ టెంపుల్స్, పుష్కర్ ఘాట్స్, అఖండ గోదావరి ప్రాంతాలుంటాయని వెల్లడించారు. చారిత్రక హేవలాక్ వంతెన, పాపికొండల పడవ ప్రయాణం, పుష్కర్ ఘాట్లు, హారతి కార్యక్రమాలు, అంతర్వేది, వాడపల్లి, అప్పనపల్లి, మందపల్లి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు తదితర క్షేత్రాలను అనుసంధానిస్తూ పర్యాటక ప్యాకేజీలు రూపొందించామన్నారు.ఆంధ్రప్రదేశ్ సందర్శనకు వచ్చే ప్రతి పర్యాటకుడు ఆనందంతో పాటు జీవితాంతం పదిలంగా దాచుకునే మధుర జ్ఞాపకాలను సొంతం చేసుకుంటారని మంత్రి దుర్గేష్ ఘంటాపథంగా చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో అత్యుత్తమ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని, ఈ వృద్ధిలో టూర్, ట్రేడ్ ఆపరేటర్ల క్రియాశీల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు."ప్రచారం నుంచి వ్యాపారం... పర్యాటకం నుంచి స్థానిక ఆర్థికాభివృద్ధి" అనే స్పష్టమైన ప్రణాళికతో పనిచేస్తున్నామని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అనుభవాలను అత్యంత సులభంగా ప్యాకేజ్ చేయడానికి, బుక్ చేయడానికి, అనుభూతి చెందడానికి, ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి వీలుగా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.రాష్ట్రానికి విచ్చేసే పర్యాటకుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, బాధ్యతాయుత పర్యాటక విధానాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన టూర్ ఆపరేటర్లను ప్రత్యేకంగా అభినందించారు. టూర్ ఆపరేటర్లే పర్యాటక రంగానికి అసలైన స్తంభాలు అని మంత్రి కొనియాడారు.



**సరైన వ్యక్తి చేతిలో పర్యాటక శాఖ – మంత్రి దుర్గేష్‌పై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రశంసలు**
ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సరైన సమయంలో అత్యంత సమర్థుడైన, సరైన వ్యక్తి చేతిలో ఉందంటూ రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా కొనియాడారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు పక్కా ప్రణాళికలతో చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ..ఏపీని ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని రకాల ప్రకృతి, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక వనరులు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఎన్నో దాగి ఉన్నాయని వెల్లడించారు. దార్శనికుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భవిష్యత్తంతా పర్యాటక రంగానిదేనని బలంగా విశ్వసిస్తున్నారని, అందుకే ఈ రంగానికి ప్రత్యేక శ్రద్ధతో ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు.రాష్ట్రానికి ఇప్పటికే మెరుగైన అనుసంధానం ఉందన్న కేంద్ర మంత్రి, విశాఖపట్నంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలకు విమాన అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్త విమానాశ్రయాల ఏర్పాటుతో పాటు సీప్లేన్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పర్యాటకుల ప్రయాణాలను మరింత వేగవంతం, సులభతరం చేస్తామని ప్రకటించారు.పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న పర్యాటక వనరులు, ప్రగతి, ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మౌలిక వసతుల కల్పనపై గణాంకాలతో కూడిన సమగ్ర నివేదికను సదస్సులో వెల్లడించారు
.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పర్యాటక పాలసీ 202429 ఇన్వెస్టర్లకు, టూర్ ఆపరేటర్లకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని ఐఏటీఓ ప్రతినిధులు తెలిపారు. రాబోయే రోజుల్లో ఏపీలోని సుందర తీరప్రాంతాలు, అరకు, పాపికొండలు,గోదావరి పుష్కరాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలు రూపొందించి విదేశీ, స్వదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తామని హామీ ఇచ్చారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన ఐఏటీఓ ప్రతినిధులను, టూర్ ఆపరేటర్లను పర్యాటక శాఖ అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏపీ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విచ్చేసిన అతిథులను విశేషంగా అలరించాయి.ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ టీడీసీ ఛైర్మన్ నీలూ శర్మ,పర్యాటక,సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ పట్టాన్ శెట్టి రవి సుభాష్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ విద్యాధరి, ఐఏటీఓ ప్రెసిడెంట్ రవి గోసేన్, ఛైర్మన్ సునీల్ మిశ్రా, ప్రతినిధులు రాజ్ నిష్కైస్తా, సంజయ్ రాజ్దాన్, దీపక్ కుమార్ భట్నాగర్, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వందలాది మంది టూర్ ఆపరేటర్లు, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి బొత్స కన్నీటిపర్యంతం

**విజయనగరం, సెప్టెంబర్ 10 , అనంతజనశక్తి న్యూస్**

విజయనగరం జిల్లా గరివిడిలోని క్యాంప్ కార్యాలయంలో చీపురుపల్లి నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ 'ఆత్మీయ కలయిక' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలను గుర్తు చేసుకుంటూ ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అంతేకాదు ఒక్కసారిగా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

**పార్టీనే శాశ్వతం - బొత్స**
కార్యకర్తలను ఉద్దేశించి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. "రాజకీయాల్లో నాయకులు లేదా వ్యక్తులు రావొచ్చు, వెళ్లిపోవచ్చు. కానీ మనం ప్రాణంగా భావించే పార్టీ ఎప్పటికీ శాశ్వతం. కాబట్టి ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. చీపురుపల్లి నియోజకవర్గంలో మనమంతా ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ఉండాలి," అని దిశానిర్దేశం చేశారు. పార్టీ అధినేత జగన్ ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.
త్వరలోనే జరగనున్న జిల్లా విస్తృత స్థాయి సమావేశంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై బొత్స కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి. రాబోయే స్థానిక ఎన్నికల్లో చీపురుపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే మన ఏకైక లక్ష్యం కావాలి. దీనికోసం ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో కష్టపడి పనిచేద్దాం," అని స్పష్టం చేశారు.
ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న యువ నాయకురాలు డాక్టర్ బొత్స అనూష, యువ నాయకుడు డాక్టర్ బొత్స సందీప్ మాట్లాడుతూ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. "రాబోయే రోజుల్లో ప్రతి నాయకుడికి, కార్యకర్తకు మేము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం. మీ కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తాం. బొత్స సత్యనారాయణ మార్గదర్శకంలో, ఆయన సూచనలకు అనుగుణంగా మనమంతా కలసికట్టుగా ముందుకు సాగుదాం. స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవడమే మన తక్షణ కర్తవ్యం" అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యనారాయణలతో పాటు చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్య నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. బొత్స సత్యనారాయణ నాయకత్వంలో రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
ఇటీవలనే వైసీపీ జిల్లా అధ్యక్షుడు, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అధికార తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బొత్సకు మేనల్లుడైన చిన్న శ్రీను... వైసీపీ బలోపేతానికి మజ్జి శ్రీనివాసరావు కీలక భూమిక పోషించారు. జిల్లా వ్యాప్తంగా బలమైన నాయకత్వ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నారు. గత కొంతకాలంగా వైసీపీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న ఆయన... తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరటం వైసీపీకి పెద్ద షాక్ నిచ్చింది. అంతేకాకుండా బొత్సకు కూడా ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో బొత్స... నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.



# 6 సవర్ల బంగారం 5 కిలోల వెండి చోరీ



**పల్నాడు జిల్లాలో భారీ చోరీ**
**- రూ.75 లక్షల సొత్తు లూటీ**

**అవ ంతపునంసెప్టెంబర్ 10 , అనంతజనశక్తి న్యూస్**

పల్నాడు జిల్లాలో భారీ చోరీ తీవ్ర కలకలం రేపుతోంది. యడ్లపాడులో తాళం వేసి ఉన్న ఓ ఇంటిని టార్గెట్ చేసిన దుండగులు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకెళ్లారు. చోరీకి గురైన మొత్తం సొత్తు విలువ సుమారు రూ.75 లక్షలు ఉంటుందని ప్రాథమికంగా తెలుస్తోంది. యడ్లపాడుకు చెందిన పార్వతి.. వ్యక్తిగత పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లినట్లు సమాచారం. ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు.. ఇదే అదనుగా భావించి ఇంట్లోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన దుండగులు బీరువాలు, ఇతర ప్రదేశాల్లో భద్రపరిచిన విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. 46 సవర్ల బంగారం, 5 కిలోల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు సమాచారం. ఈ చోరీలో సుమారు రూ.75 లక్షల విలువైన ఆస్తి మాయమైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తి అయి.. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు, స్వాధీనం చేసుకున్న ఆధారాల ఆధారంగా అసలు చోరీ అయిన సొత్తు విలువపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.
హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన పార్వతికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి అనుమానం వచ్చింది. లోపలికి వెళ్లి పరిశీలించగా బంగారం, వెండి ఆభరణాలు, నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న యడ్లపాడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి ఆధారాలను సేకరించారు. చోరీ జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.
దుండగుల కదలికలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు ముందు, తర్వాత అనుమానాస్పదంగా సంచరించిన వ్యక్తులు, వాహనాల వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. సీసీటీవీ కెమెరాల ఫుటేజీతో పాటు ఘటనాస్థలంలో లభించిన ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. భారీ మొత్తంలో బంగారం, వెండి, నగదు చోరీకి గురైన నేపథ్యంలో పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. నిందితులు ముందుగా ఇంటిని రెక్కీ చేశారా.. బాధితురాలు హైదరాబాద్ వెళ్లిన విషయం వారికి ఎలా తెలిసింది.. చోరీలో స్థానికుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణాల్లోనూ కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. త్వరలోనే నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ఇకపై పైలట్లందరికీ డ్రగ్ టెస్టులు







**(మొదటి పేజీ తరువాయి)**

ఇటీవల విమాన సిబ్బంది నిషేధిత మాదక ద్రవ్యాల ప్రభావంలో ఉన్నట్లు గుర్తించిన ఘటనలు వెలుగులోకి రావడంతో డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు విమానయాన సంస్థల్లో పైలట్ల డ్రగ్ టెస్టింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు సమాచారం.
ఫుకెట్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో పైలట్ల డ్రగ్ టెస్టుల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ A320 విమానంలో మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి పనిచేయకుండా పోయాయి. విమానంలో భద్రత కోసం అనేక స్థాయిల్లో ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఉండటంతో మూడు హైడ్రాలిక్ సిస్టమ్స్ ఒకేసారి విఫలం కావడం చాలా అరుదైన ఘటనగా భావిస్తున్నారు. ఈ వైఫల్యం కారణంగా ఆటోపైలట్ డిస్‌ఎంగేజ్ అయి విమానం సుమారు 300 అడుగుల మేర కిందికి పడిపోయింది.

**పైలట్ డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్**
**ఆగస్టు 4న ఈ విమానం భారత్‌లో ల్యాండ్ అయిన తర్వాత నిర్వహించిన పరీక్ష□ల్లో విమానం కెప్టెన్ నిషేధిత మాదక ద్రవ్యాలకు పాజిటివ్‌గా తేలినట్లు అధికారులు గుర్తించారు. అయితే పైలట్ మాదక ద్రవ్యాల వినియోగానికి, విమానం గాల్లో అకస్మాత్తుగా కిందికి పడిపోవడానికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందా అనే విషయం దర్యాప్తులో ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. అయితే ఈ డ్రగ్ వినియోగం వెలుగులోకి రావడం "తీవ్రమైన ఆందోళన కలిగించే అంశం" అని భారత విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ (AAIB) పేర్కొంది. ఇటీవల విడుదల చేసిన మధ్యంతర నివేదికలో ఈ విషయంపై డీజీసీఏ తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది.**

**ఎయిర్ ఇండియా కూడా కీలక నిర్ణయం**

ఈ ఘటన తర్వాత ఎయిర్ ఇండియా కూడా తన పైలట్లందరికీ ఒక్కసారి డ్రగ్ టెస్టులు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పైలట్ల డ్రగ్ టెస్టింగ్ నిబంధనలను మరింత పటిష్టం చేసే అంశంపై డీజీసీఏ విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోంది. ఇదిలా ఉంటే మలేషియా ఎయిర్‌లైన్స్ కూడా ఆగస్టులో తమ కాక్‌పిట్ సిబ్బందిలో ఒకరిని మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై అరెస్ట్ చేసిన ఘటన తర్వాత తప్పనిసరి డ్రగ్ టెస్టింగ్‌ను ప్రవేశపెట్టింది.

**నెలాఖరులో కొత్త నిబంధనలు**
**పైలట్లకు సంబంధించిన సవరించిన డ్రగ్ టెస్టింగ్ నిబంధనల ముసాయిదాను ఈ నెలాఖరులోగా ఖరారు చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కొత్త నిబంధనల్లో ఏ మార్పులు చేయబోతున్నారనే విషయాన్ని మంత్రి వివరించలేదు. అయితే పైలట్లు వినియోగించే సైకోయాక్టివ్ పదార్థాలపై మరింత కఠినమైన పరీక్షలు, అలాగే దేశవ్యాప్తంగా అన్ని విమానయాన సంస్థలకు మరింత సమగ్రంగా వర్తించే విధానాన్ని తీసుకురావచ్చని తెలుస్తోంది. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే పైలట్ల ఆరోగ్యం, అప్రమత్తత, ప్రయాణికుల భద్రత విషయంలో విమానయాన సంస్థలపై మరింత బాధ్యత పెరగనుంది.**

# పవన్ వల్లే కాపులకు విలువ

**- 50-60 సీట్ల లక్ష్యం పెట్టుకున్నాం**
**- ఎమ్మెల్యే బొలిశెట్టి ఆసక్తికర వ్యాఖ్యలు**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన అమలాపురం పార్లమెంట్ జనసేన కార్యకర్తల సమావేశంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాపు సామాజిక వర్గం, జనసేన పార్టీ భవిష్యత్ వ్యూహం, స్థానిక సంస్థల ఎన్నికల ప్రాధాన్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు బొలిశెట్టి.. స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని జనసేన శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునివ్వడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.
అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన అమలాపురం పార్లమెంట్ జనసేన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కాపులు లేని రాజకీయాలు లేవని, పవన్ కల్యాణ్ లేకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు ఉండవని అన్నారు. పవన్ కల్యాణ్ నాయకత్వం వల్లే కాపు సామాజిక వర్గానికి విలువ పెరిగిందని పేర్కొన్నారు. కోనసీమలో కాపులు అధిక సంఖ్యలో ఉన్నందున వారిని కొందరు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో అమలాపురంలో కులాల పేరుతో విభజనలు సృష్టించారని విమర్శించారు.

# చుండ్రుని పోగొట్టే చిట్కాలు, ఏం చేయాలంటే



చుండ్రు వచ్చిందంటే అంత సులువుగా వదిలిపెట్టదు. మహా చిరాకు పెడుతుంది. దీన్ని పోగొట్టుకునేందుకు రకరకాల షాంపూలు, కండీషనర్లు వాడాల్సి వస్తుంది. ఇక మందులు కూడా వాడేవాళ్లు ఉంటారు. వీటి వల్ల కొంత వరకూ ప్రయోజనం ఉన్నప్పటికీ శాశ్వతంగా చుండ్రు తొలగిపోతుందన్న గ్యారెంటీ లేదు. పైగా వీటిలో ఉండే కొన్ని రకాల కెమికల్స్ కురుల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. అయితే ఇలాంటి సమస్యలు ఏవీ ఉండకూడదు అంటే సహజమైన పద్ధతిలోనే చుండ్రును వదిలించుకోవాలి. ఇంట్లో దొరికే పదార్థాలతోనే దీనిని పోగొట్టుకోవాలి. ఇలాంటి చిట్కాల గురించే ఇప్పుడు చెప్పకోబోతున్నాం. చాలా సులువైన చిట్కాలతోనే సమస్యను దూరం చేసుకోవచ్చు. మరి ఆ ఇంటి చిట్కాలు ఏంటి. ఏం చేస్తే చుండ్రు నుంచి విముక్తి కలుగుతుంది అనే వివరాలు తెలుసుకుందాం.



**నిమ్మరసంతో**

నిమ్మరసంలో అసిడిక్ గుణాలు అధికంగా ఉంటాయి. పైగా ఇందులో యాంటీ ఫంగల్ గుణాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. స్కాల్ప్ పై ఎలాంటి ఇన్ఫెక్షన్ వచ్చినా, ఫంగస్ ఏర్పడినా వాటిని తొలగించడంలో నిమ్మరసం చాలా ఎఫెక్టివ్ గా పని చేస్తుంది. స్కాల్ప్ లో సాధారణంగానే నేచురల్ ఆయిల్స్ ఉత్పత్తి అవుతూ ఉంటాయి. ఎప్పుడైతే ఈ ఆయిల్స్ ఎక్కువవుతాయో అప్పడు చుండ్రు వస్తుంది. నిమ్మరసం ఈ ఆయిల్స్ ని తగ్గిస్తుంది. ఓ గ్లాసు నీటిలో నిమ్మరసం కలపాలి. షాంపూతో తలస్నానం చేసిన తరవాత ఈ నిమ్మరసాన్ని కురులకు అప్లై చేయాలి. ఇలా కనీసం వారానికి రెండు సార్లు చేయడం వల్ల స్కాల్ప్ పై ఉండే ఫంగస్ తొలగిపోవడంతో పాటు జుట్టు కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఇక రెగ్యులర్ గా వాడితే స్కాల్ప్ క్లీన్ గా ఉండడమే కాకుండా దురద తగ్గిపోతుంది. కురులకు సహజంగానే మెరుపు వస్తుంది.

**కొబ్బరి నూనె**

కొబ్బరి నూనె కూడా చుండ్రును తగ్గించడంలో తోడ్పడుతుంది. కొబ్బరి నూనెలో యాంటీ ఫంగల్ గుణాలు అధికంగా ఉంటాయి. పైగా స్కాల్ప్ లో తేమను పట్టి ఉంచడంలోనూ సహకరిస్తుంది. అయితే కొబ్బరి నూనెను నేరుగా కాకుండా కాస్తంత వేడి చేసి కురులకు అప్లై చేయడం మంచిది. ఇలా చేస్తే కురుల కుదుళ్ల వరకూ నూనె పడుతుంది. ముఖ్యంగా స్కాల్ప్ పొడిబారకుండా ఉంటుంది. అన్నింటి కన్నా కీలకంగా చుండ్రు రాకుండా ఇది అడ్డుకుంటుంది. సాధారణంగా చుండ్రు వచ్చినప్పుడు విపరీతంగా దురద వస్తుంది. లేదా స్కాల్ప్ లో ఏదైనా ఫంగస్ ఏర్పడినా



ఇలాగే ఇచింగ్ వస్తుంది. ఈ దురద తగ్గించడంలోనూ కొబ్బరి నూనె ఎంతో ఉపయోగపడుతుంది. కేవలం చుండ్రును పోగొట్టడమే కాకుండా.. కురులు ఆరోగ్యంగా పెరగడానికి కూడా ఇది సహకరిస్తుంది. అందుకే వారానికి కనీసం రెండు మూడు సార్లు ఇలా కొబ్బరి నూనె అప్లై చేసుకోవడం మంచిది.

**అలోవెరాతో**

అలోవెరా జెల్ కూడా చుండ్రుని పోగొట్టడంలో చాలా బాగా పని చేస్తుంది. కలబందలో యాంటీ మైక్రోబయల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి స్కాల్ప్ ని శుభ్రపరుస్తాయి. అలోవెరా జెల్ ని నేరుగా కురులకు అప్లై చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం ద్వారా స్కాల్ప్ పై ఇరిటేషన్ తగ్గుతుంది. ముఖ్యంగా ఫంగస్ ఏమైనా ఉంటే అది పూర్తిగా తొలగిపోతుంది. ఈ ఫంగస్ కారణంగానే డాండ్రఫ్ వస్తుంది. ఎప్పుడైతే ఫంగస్ తొలగిపోతుందో అప్పడు సహజంగానే చుండ్రు తగ్గిపోతుంది. అయితే అలోవెరా జెల్ అప్లై చేసిన తరవాత కనీసం అరగంట పాటు అలాగే ఉంచాలి. ఆ తరవాత తలస్నానం చేయాలి. అలోవెరా జెల్ లో ఉండే కూలింగ్ ఎఫెక్ట్ ఇన్ ఫ్లమేషన్ ని తగ్గిస్తుంది. రెగ్యులర్ గా వాడడం వల్ల చుండ్రు తొలగిపోవడంతో పాటు కురులు సాఫ్ట్ గా మారిపోతాయి. నేచురల్ గానే మెరుపు కూడా వస్తుంది.

**బేకింగ్ సోడా స్క్రబ్**

బేకింగ్ సోడాను ఎన్నో విధాలుగా వాడుతుంటారు. ముఖ్యంగా మరకలు వదిలించడం కోసం వినియోగిస్తారు. అయితే చుండ్రు తొలగించడం కోసం కూడా ఇది బాగానే ఉపయోగపడుతుంది. డెడ్ స్కిన్ సెల్స్ ని తొలగించి స్కాల్ప్ ని శుభ్రంగా ఉంచడంలో తోడ్పడుతుంది. అంతే కాదు. స్కాల్ప్ లో ఫంగస్ ఏర్పడకుండా అడ్డుకుంటుంది. అయితే ఈ చిట్కా పాటించే ముందుగా తలను మామూలు నీళ్లతో ఓ సారి శుభ్రం చేసుకోవాలి. ఆ తరవాత కాస్తంత బేకింగ్ సోడా తీసుకోవాలి. నేరుగా స్కాల్ప్ పై వేసి అప్లై చేయాల్సి ఉంటుంది. ఇలా అప్లై చేసిన తరవాత కాసేపటి వరకూ అలాగే ఉంచాలి.

# స్ట్రెయిటనర్ వాడకుండానే జుట్టు స్ట్రెయిట్‌గా మారాలా, ఇప్పుడు చెప్పిన నూనెలు రాస్తే సిల్కీగా మారడమే కాకుండా పొడుగ్గా పెరుగుతుంది కూడా





జుట్టు సంరక్షణకోసం నూనెలు ఎంతో ముఖ్యమైనవి. వీటిని వాడడం వల్ల జుట్టుకి పోషణ అందుతుంది. అదే విధంగా, కొన్ని నూనెల్ని వాడడం వల్ల జుట్టు నేచురల్‌గానే అందంగా, పొడుగ్గా మారుతుంది. అంతేకాదు, ఆ నూనె రాయడం వల్ల జుట్టు స్ట్రెయిట్‌గా మారుతుంది. స్ట్రెయిటనర్ లేకుండా జుట్టు అందంగా, పొడుగ్గా, స్ట్రెయిట్‌గా మారాలనుకుంటే ఇప్పడు చెప్పే కొన్ని ఆయిల్స్ హెల్ప్ చేస్తాయి. వీటిని వాడడం వల్ల చాలా వరకూ జుట్టుకి పోషణ అంది పొడుగ్గా, స్ట్రెయిట్‌గా మారుతుంది. అంతేకాకుండా, కొన్నిఆయిల్స్ జుట్టుకి లోపలి నుంచి పోషణని అందించి అందంగా, బలంగా మారేలా చేస్తాయి. దీని వల్ల జుట్టు రాలడం తగ్గుతుంది. పైగా ఒత్తుగా పెరుగుతుంది కూడా.

**కొబ్బరినూనె**

కొబ్బరినూనెని జుట్టు కుదుళ్ళ నుంచి లోతుగా పోషణ అందుతుంది. కొబ్బరినూనెలో ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. రెగ్యులర్‌గా కొన్నిరోజుల పాటు జుట్టుకి కొబ్బరినూనె రాస్తే జుట్టు మృదువుగా, సహజంగానే స్ట్రెయిట్‌గా మారుతుంది. దీనిని వాడడం వల్ల నేచురల్‌గా మృదువుగా మారుతుంది. కెమికల్స్ ఉన్న సీరమ్ బదులు కొబ్బరినూనె రాస్తే క్యూటికల్‌లోకి చొచ్చుకుపోతుంది. ప్రోటీన్ నష్టాన్ని తగ్గించి జుట్టుని బలంగా మారుస్తుంది.

ఎలా వాడాలంటేనూనెని కొద్దిగా వేడిచేసి తలకి జుట్టు పొడవునా మసాజ్ చేయండి. రాత్రంతా అలానే ఉండండి. లేదంటే ఓ గంట, రెండు గంటల పాటు అలానే ఉంచి మైల్డ్ షాంపూతో తలస్నానం చేయండి. మీ జుట్టుకి నూనె రాశాక వేడి టవల్ చుట్టండి. దీని వల్ల నూనె తలకి బాగా అబ్జార్బ్ చేసుకుంటుంది. కొబ్బరినూనెని వాడడం వల్ల జుట్టు క్యూటికల్స్‌ని బలంగా చేసి ఫ్రీజ్‌ని తగ్గించి ఎలాంటి హీటర్స్ వాడకుండానే జుట్టు పొడుగ్గా



మారుతుంది.\

**ఆర్గాన్ ఆయిల్**

ఆర్గాన్ ఆయిల్‌ని లిక్విడ్ గోల్డ్ అంటారు. దీనికి కారణం ఇందులోని పోషకాలే. ఇందులో ఎక్కువగా విటమిన్ ఈ, యాంటీ ఆక్సిడెంట్స్, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్‌స్‌తో నిండి ఉంటుంది. ఇది జుట్టుకి రాస్తే జుట్టు స్ట్రెయిట్‌గా మారుతుంది. దీనిని రాయడం వల్ల జుట్టు జిడ్డుగా మారదు.

ఎలా వాడాలి. కొద్దిగా ఆయిల్‌ని చేతిలో వేసుకుని జుట్టుకి రాయండి. మసాజ్ చేయండి. దీనిని రాయడం వల్ల సిల్కీ, షైనీ హెయిర్ మీ సొంతమవుతుంది. దీని వల్ల ఎలాంటి స్ట్రెయిటనర్ లేకుండానే జుట్టు అందంగా, పొడుగ్గా మారుతుంది.

**బాదం నూనె**

బాదం నూనెలో విటమిన్ ఈ, మెగ్నీషియం, ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా



ఉంటాయి. ఇవి క్యూటికల్‌స్‌ని మృదువుగా చేసి జుట్టుని బలంగా చేస్తాయి. దీనిని రాయడం వల్ల జుట్టు పొడిబారడం, చిట్లడం వంటి సమస్యల్ని తగ్గిస్తాయి.

ఎలా వాడాలి.

రెండు టేబుల్ స్పూన్ల బాదం నూనెని వేడి చేసి తలపై, జుట్టు మొత్తానికి మసాజ్ చేయాలి. తలస్నానానికి ముందు ఓ గంట పాటు అలానే ఉంచి రాయండి. బాదం నూనెలో కొద్దిగా ఆముదం కలిపితే మంచి రిజల్ట్ ఉంటుంది. బాదం నూనెలో స్మూతింగ్ గుణాలు ఉంటాయి. ఇవి జుట్టుని స్ట్రెయిట్‌గా చేస్తాయి.

**రైస్ బ్రాన్ ఆయిల్**

రైస్ బ్రాన్ ఆయిల్ జుట్టుకి చాలా మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒరిజనాల్‌తో నిండి ఉంటాయి. ఇవి జుట్టుని మెరిసేలా చేస్తాయి. జుట్టుని మృదువుగా చేస్తుంది.

ఎలా వాడాలి?

రైస్ బ్రాన్ ఆయిల్‌ని జుట్టుకి రాసి మసాజ్ చేయాలి. 45 నిమిషాల పాటు అలానే ఉంచండి. తర్వాత మైల్డ్ షాంపూ వాడడండి. దీని వల్ల జుట్టు స్ప్లిట్ ఎండ్స్ తగ్గుతాయి. జుట్టు అందంగా మారుతుంది.

**ఆముదం**

జుట్టు స్ట్రెయిట్‌గా మారడమే కాదు, రాలడం తగ్గి డ్రైగా మారకుండా ఉండాలంటే ఆముదం రాయడం మంచిది. ఈ ఆయిల్ మిగతా నూనెల కంటే మందంగా ఉన్నప్పటికీ దీని వల్ల జుట్టు బలంగా మారుతుంది. ఇందులో రిసినోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది తేమని లాక్ చేసి క్యూటికల్‌స్‌ని బలంగా చేస్తుంది.

ఎలా వాడాలి.

కొద్దిగా ఆముదంలో, కొబ్బరినూనెని సమాన పరిమాణంలో తీసుకుని కలపాలి. దీనిని కొద్దిగా వేడి చేసి తలకి మసాజ్ చేయాలి. గంట పాటు అలానే ఉంచి ఆ తర్వాత తలస్నానం చేయాలి. దీనిని రెగ్యులర్‌గా రాయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా మారి మెరుస్తుంది. జుట్టు మూలాలు కూడా బలంగా మారతాయి.

# 'సర్దార్ 2' సుందరి ఆషికా రంగనాథ్

కార్తితో కలిసి 'సర్దార్ 2' అంటూ సందడి చేసేందుకు సిద్ధమయ్యారు నటి ఆషికా రంగనాథ్. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నేడు (సెప్టెంబర్ 10) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కాలేజీ రోజుల్లో మిస్ ఫ్రెష్ ఫేస్ పోటీల్లో పాల్గొన్న ఆమె.. రన్నరప్‌గా నిలిచారు. ఆ పోటీల్లో ఆషికను చూసిన దర్శకుడు మహేశ్‌బాబు ఆమెకు 'క్రేజీ బాయ్' సినిమాలో అవకాశం ఇచ్చారు.'క్రేజీ బాయ్' అంటూ తొలిసినిమాతోనే ఉత్తమ నటిగా సైమా అవార్డు అందుకొని వావ్ అనిపించారు. ప్రతి విషయం సోషల్ మీడియాలో పంచుకుంటారు. కన్నడ హీరోయిన్స్‌లో సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్నవారిలో ఆషిక ఒకరు. ఇండస్ట్రీలో హీరోయిన్స్‌ను చూసే తీరు మారాలని.. వారు పారితోషికం కోసం పాత్రలు ఎంచుకుంటారనే అపోహ పోవాలంటూ విమర్శలపై ఘాటుగా స్పందిస్తారు. రవితేజ నటించిన 'విక్రమార్కుడు' అంటే చాలా ఇష్టం. అందులో ఆయన చేసిన రెండు పాత్రలకు ఆషిక ఫ్యాన్. విరామం దొరికితే టూర్‌లకు వెళ్లడం ఇష్టం. కొత్త వ్యక్తులను కలిసి వాళ్ల గురించి తెలుసుకుంటుంటారు.



# నా జీవితంలోకి వచ్చిన ఒకరికి ఆస్కార్ ఇవ్వొచ్చు: జయం రవి భార్య ఆర్తి

నటుడు జయం రవి భార్య ఆర్తి పెట్టిన ఇన్‌స్టా స్టోరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడూ ఇన్‌స్టాలో యాక్టివ్‌గా ఉండే ఆర్తి తాజాగా ఓ నోట్ పంచుకున్నారు. "సూర్య, అజిత్, విక్రమ్, కమల్ హాసన్.. వీళ్లందరి కంటే నా జీవితంలోకి వచ్చి ఒకరు నటించిన నటనకి ఆస్కార్ అవార్డు కూడా ఇచ్చేయొచ్చు" అని రాశారు. తన భార్య ఆర్తి నుంచి విడిపోతున్నట్లు రవి మోహన్ 2024లో ప్రకటించారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో మహిళలే కరెక్ట్ అని చాలా మంది అనుకుంటారని, కానీ అసలైన బాధితులు పురుషులేనని జయం రవి చేసిన కామెంట్స్‌పై ఆర్తి స్పందించారు. 'ఒకవేళ విడాకులు రాక ముందే నేను వేరే వ్యక్తితో కలిసి ఉంటే..?.అదొక అసహ్యమైన ప్రవర్తన' అని ఆమె తెలిపారు. మరోవైపు నేడు జయం రవి (Ravi Mohan) పుట్టిన రోజు సందర్భంగా 'వడ్డీ కాసులవాడ' మూవీ టీమ్ శుభాకాంక్షలు తెలిపింది. మనోజ్ ప్రధానపాత్రలో నటిస్తోన్న ఈ సినిమాలో రవి వెంకటేశ్వరస్వామిగా కనిపించనున్నారు.



# నటిని కావాలనే కలకు అదే ప్రేరణ: కృతి సనన్

చిత్ర పరిశ్రమలో కెరీర్‌కు ముందు అనుకోకుండా వచ్చిన ఓ మోడలింగ్ అవకాశం.. తనని నటనవైపు అడుగులు వేసేలా చేసిందని ఇటీవల ఓ సందర్భంలో పంచుకుంది బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్. "నాకు మోడల్ అవ్వాలనే ఉద్దేశం ఎప్పుడూ లేదు. కానీ, కొందరు నన్ను చూసి.. మోడలింగ్ ప్రయత్నించమని సలహాలు ఇచ్చారు. సరే ఓసారి ప్రయత్నించి చూద్దాం. ఏమీ కాకపోయినా అదొక అనుభవంగా ఉంటుందని అనుకున్నా. అలా నా సోదరి అనుకోకుండా తీసిన ఫొటోలను కొన్ని పోస్ట్ చేయడంతోనే మోడల్‌గా ఎంపికయ్యాను. అప్పుడు మా నాన్న 'చాలా శ్రద్ధగా చదువుతావు.. మోడలింగ్ వైపు వెళ్తే చదువుకి ఆటంకం. ఎందుకిదంతా' అన్నారు. కానీ, మా అమ్మ ఫర్వాలేదు.. ఒప్పందంపై నేను సంతకం చేస్తానని ప్రోత్సహించారు. ఆ తర్వాత టీవీ ప్రకటనలు చేయడం మొదలుపెట్టాక.. కొంచెమైనా నటించగలనని అనిపించింది. అప్పుడే నా మనసులో ఎక్కడో నెమ్మదిగా నటిని కావాలని కలలు కనడం మొదలు పెట్టాను. అలా నటిగా రాణించాలనే నా ఆలోచన మోడలింగ్‌తోనే ప్రారంభమైంద"ని చెప్పుకొచ్చింది.



# జూనియర్ హాకీ ఆసియాకప్: పాక్ చిత్తు.. సెమీస్‌లో భారత్

పాకిస్థాన్‌ను టీమ్‌ఇండియా చిత్తు చేసింది. అదేంటి ఇప్పుడేం మ్యాచ్ అంటారా? జూనియర్ మహిళల హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు విజృంభించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో 19-0 తేడాతో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. చైనా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత ప్లేయర్ల ముందు పాక్ ఏమాత్రం నిలవలేకపోయింది. గ్రూప్ స్టేజ్‌లో జపాన్, మలేషియా, దక్షిణ కొరియాను ఓడించిన భారత్.. చైనాతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇప్పుడు క్వార్టర్స్‌లో పాక్‌పై గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. దక్షిణా కొరియా - మలేషియా పోరులో విజేతగా నిలిచే టీమ్‌తో భారత్ సెమీఫైనల్‌లో తలపడనుంది.

భారత యువ ప్లేయర్ పూజ ఏడో నిమిషంలోనే గోల్ కొట్టింది. ఆ తర్వాత సానికా మనె మరో రెండు గోల్స్ చేసింది. సగం సమయానికే భారత్ 10-0 లీడ్‌లోకి వెళ్లిపోయింది. మాలిక్ హ్యాట్రిక్‌తో రెండో అర్ధభాగంలోనూ టీమ్‌ఇండియాదే హవా. పాక్ నుంచి కనీస పోరాటం కూడా లేదు. ఆ జట్టు ఒక్కసారి కూడా గోల్ పోస్టు వైపు రాలేకపోయింది. ఇప్పటికే 2023, 2024 సీజన్లలో ఆసియా కప్‌ను గెలిచిన టీమ్‌ఇండియా.. హ్యాట్రిక్‌పై గురి పెట్టింది.



# భారత్ కోసం.. ఆ లీగ్‌ను వదులుకున్న స్టార్ క్రికెటర్

న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల క్రికెట్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు వచ్చిన కాంట్రాక్ట్‌ను వద్దని తిరస్కరించాడు. 'నేషన్ ఫస్ట్' అని అంతర్జాతీయ మ్యాచుల కోసం సన్నద్ధమయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. బీబీఎల్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ జట్టు శాంట్నర్‌కు ఆఫర్ ఇచ్చింది. అయితే, భారత్‌తోపాటు ఆస్ట్రేలియాతో సిరీసులు ఉన్న నేపథ్యంలో తాను అందుబాటులో ఉండనని శాంట్నర్ బదులిచ్చాడు. "మాకు ఇప్పుడు వసంతకాలం. రాబోయే సమ్మర్‌లో భారత జట్టు మాతో సిరీస్‌లను ఆడేందుకు రానుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనకు మేం వెళ్తాం. అంతర్జాతీయ మ్యాచుల కంటే ఏదీ ఎక్కువ కాదు. ఇది మాకు అత్యంత కీలకమైన సమయం. అందులో నేనూ భాగం కావాలని అనుకుంటున్నా. బీబీఎల్ నుంచి వచ్చిన ఆఫర్ బాగుంది. అందులో దాచేందుకు ఏమీ లేదు. కానీ, నేను కివీస్ తరఫున ప్రతి మ్యాచ్‌నూ ఆడాలని అనుకుంటున్నా. అందుకు సన్నద్ధం కావాల్సి ఉంది" అని శాంట్నర్ తెలిపాడు. మరోవైపు బిగ్‌బాష్, దక్షిణాఫ్రికా టీ20 లీగ్ జరిగే సమయంలోనే న్యూజిలాండ్ వేదికగా సూపర్ స్మాష్ టీ20 లీగ్ కూడా ఉంటుంది. కివీస్‌కు చెందిన కాంట్రాక్ట్ ప్లేయర్లలో పలువురు అందుబాటులో ఉండే అవకాశం ఉంది.



# టార్గెట్ అజిత్ అగార్కర్.. రోహిత్ శర్మ 'టీ షర్ట్' వైరల్

భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మైదానంలో ఎంత సరదాగా ఉంటాడో, గ్రౌండ్ వెలుపల కూడా అంతే చలాకీగా ఉంటాడు. తోటి ఆటగాళ్లు, ఫ్రెండ్స్‌తో జాలీగా ఉంటూ తనదైన స్టైల్‌లో పంచ్‌లు విసురుతుంటాడు. అప్పడప్పుడు అవి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తాయి. తాజాగా రోహిత్ సైలెంట్‌గా వేసిన ఓ కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. టీమ్‌ఇండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ను ఉద్దేశించే ఈ కౌంటర్ ఇచ్చాడని నెటిజన్లను చర్చించుకుంటున్నారు. ఇంతకీ అసలు విషయం ఏంటంటే.. సెప్టెంబరు 19 నుంచి బుల్లి తెరపై ప్రసారం కానున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే ఎంటర్‌టైన్‌మెంట్ షో ద్వారా హోస్ట్‌గా హిట్‌మ్యాన్ కొత్త అవతారం ఎత్తబోతున్నాడు. ఈ షోకు సంబంధించిన ప్రోమో షూటింగ్ సమయంలో రోహిత్ వైట్ కలర్ టీ షర్ట్ ధరించి కెమెరాతో మాట్లాడాడు. ఆ టీ షర్ట్‌పై కమిట్‌మెంట్ లేదా? అని రాసి ఉంది. నోటితో ఏమీ అనకపోయినా ఈ కోట్‌తో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను రోహిత్ టార్గెట్ చేశాడని నెట్టింట అభిమానులు చర్చించుకుంటున్నారు.

# లేటు వయసులోనూ.. దీటైన గేమ్

నాలుగు పదుల వయసులోకి అడుగు పెట్టారంటే.. యువకులతో ఏం పోటీపడతాంలే అని ఆటకు గుడ్‌బై చెప్పేసి ఏ కామెంటేటర్‌గానో.. అనలిస్ట్‌గానో మారిపోతారు కొందరు ప్లేయర్లు. మేం మాత్రం అలా కాదు.. కుర్రాళ్లకు సవాల్ విసిరేందుకు ఇప్పటికీ సై అంటూ దూసుకుపోతున్నారీ 'వెటరన్' ప్లేయర్లు.

ఇమ్రాన్ తాహిర్ .. అదేనండీ వికెట్ తీయగానే మైదానమంతా పరుగులు పెడతాడే ఆ వెటరన్ స్పిన్నర్ గుర్తున్నాడా? ఐపీఎల్‌లోనూ ఆడిన ఈ దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ తాజాగా ఓ ప్రపంచ రికార్డు సృష్టించాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో ఓ ఘనత నమోదు చేశాడు. ఫైఫర్ తీసిన అతిపెద్ద వయస్కుడిగా ఘనత సాధించాడు. కరేబియన్ ప్రిమియర్ లీగ్‌లో గయానా అమెజాన్ వారియర్స్ జట్టు సారథిగా ఉన్నాడు. సెయింట్ లూసియా కింగ్స్‌పై 17 పరుగులే ఇచ్చిన తాహిర్ 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో 47 ఏళ్ల 167 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యధిక వయసులో ఫైఫర్ తీసిన బౌలర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును తాహిర్ అధిగమించాడు. గతేడాదే ఇదే సీపీఎల్‌లో ఆ ఫీట్‌ను నమోదు చేశాడు. అప్పుడు అతడి వయసు 46 ఏళ్లు. మహిళల విభాగంలో 40 ఏళ్ల వరకూ క్రికెట్ ఆడటమే అరుదు.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314